



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 153, పేజీలు - 08

సోమవారం, అక్టోబర్ 7, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati





## బీజేపీ తరఫున ప్రచారం చేస్తా కానీ..

## అరవింద్ కేజ్రీవాల్ సంచలనం




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** తాను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం చేస్తానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్. అయితే, అందుకు ప్రధాని నరేంద్ర మోడీకి ఆయన ఓ సవాల్ విసిరారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేశంలోని 22 ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో ప్రజలకు ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తే తాను బీజేపీ తరపున ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు. తమ డిమాండ్‌ను నెరవేర్చేందుకు బీజేపీ సిద్ధమేనా? అని ప్రధాని నరేంద్ర మోడీకి అరవింద్ కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఢిల్లీలో 'జనతా కీ అదాలత్' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అంతటా విఫలమయ్యాయని ఆరోపించారు. అంతేగాక, హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో బీజేపీకి ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. హర్యానా, జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ ప్రభుత్వాల పతనం ఖాయమన్నారు అరవింద్ కేజ్రీవాల్. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అంటే ద్రవ్యోల్బణం, అవినీతి, నిరుద్యోగేనంటూ ఆరోపించారు. బీజేపీ ప్రజావ్యతిరేకమని మండిపడ్డారు. బస్ మార్షల్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లను తొలగించడంతోపాటు ఢిల్లీలో హెూంగార్డుల వేతనాలను నిలిపివేసిందని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. దేశ రాజధానిలో ప్రజాస్వామ్యం లేదన్న కేజ్రీవాల్ అక్కడ ఎల్జీ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. పదేళ్లలో బీజేపీ ఏమీ చేయలేదన్నారు అరవింద్ కేజ్రీవాల్.

2లో..

# మూసీ సుందరీకరణపై రేవంత్‌కూ ఎన్నో సమస్యలు

## - సాధించగలరా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మూసీ సుందరకీరణ ప్రాజెక్టు చేపట్టాము. నిధులు కూడా కేటాయించాము. కానీ ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది కాబట్టి మూసీ ప్రక్షాళనకు చాలా నిధులు అవసరం కాబట్టి పక్కన పెట్టాము అని సీఎం రేవంత్ రెడ్డి వైఎస్ ఆత్మగా పేరొందిన కేవీపీ రామచంద్రరావు రాసిన లేఖలో చెప్పారు. కేసీఆర్ హయాంలో మూసీ సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కూడా ఇదే చెప్పారు. కేసీఆర్ మూసీ సుందరీకరణ ప్రాజెక్టును సీరియస్ గా తీసుకున్నారని కానీ భారీగా నిర్వసితులు ఉంటారని వారికి పరిహారం చెల్లించడానికి నిధులు లేవు కాబట్టి పక్కన పెట్టేశారని చెప్పారు. అంటే బలమైన సీఎంలుగా పేరు పొందిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్ మూసీ విషయంలో చాలా తీవ్రంగా ప్రయత్నించిన విఫలయ్యారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆ బాధ్యతను అంత కంటే ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

### ఇద్దరు సీఎంలు చేయలేకపోయిన ప్రాజెక్టును నెత్తికెత్తుకున్న రేవంత్

మూసీ సుందరీకరణ అనేది రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అనుకోవచ్చు. ప్రయత్నించి విఫలమైన వైఎస్, కేసీఆర్ ల కంటే రేవంత్ ప్రణాళికాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

2లో..



# 3 నెలలుగా జీతాలు వస్తలేవు

## - పవన్ కళ్యాణ్‌కు షాకిచ్చిన ఆయన శాఖల ఉద్యోగులు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** తమకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని సంబంధిత శాఖల ఉద్యోగులు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తమకు జీతాలు రావడం లేదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్డబ్ల్యూఎస్ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఇంటర్నల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబరేటరీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు మంగళగిరిలో పవన్ కళ్యాణ్ ను కలిసి తమకు 3 నెలలుగా జీతాలు రావడం లేదని, తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని వాపోయారు. ఎలాగైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే, తమ కుటుంబాలు రోడ్డున పడతాయని మంత్రికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ జీతాలు క్లియర్ చేయాలని అధికారులను ఆదేశిస్తానని, సమస్యల పరిష్కారానికి

2లో..

## కేసీఆర్ ఉద్యోగం పోయి

# పేదలకు ఉద్యోగాలు వస్తున్నాయి

## - మురికి కూపమైన మూసీని ప్రక్షాళన చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి

- మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం
- మూసీ పరీవాహక ప్రాంతం బఫర్ జోన్ లో ఉన్న ఇళ్ల తొలగింపు
- మూసీ నిర్వాసితులను ఆదుకుంటామన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ కుటుంబం పేదలను రెచ్చగొడుతోందని ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో కేసీఆర్ ఉద్యోగం పోయి పేదలకు ఉద్యోగాలు వస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని ఏళ్లపాటు సాగదీసిందని నోటిఫికేషన్ దశలోనే కొన్నేళ్ల పాటు ఉంచారని విమర్శించారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన 'కొలువుల పండుగ' కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన 1,635 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖలో ఉద్యోగాలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ పునఃనిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'మార్పు రావాలి, కాంగ్రెస్ గెలవాలన్న ఆలోచనతో ఆనాడు నేను చేపట్టిన 'విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్'కు మీరంతా మద్దతిచ్చారు. కేసీఆర్, ఆయన కుటుంబంలోని వారి ఉద్యోగాలు పోతేనే పేదలకు ఉద్యోగాలు వస్తాయని ఆనాడు చెప్పాను. చెప్పినట్లే జరిగింది. కొన్ని సంవత్సరాల నుంచి నియామకాలు లేక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక లక్షలాది మంది నిరుద్యోగ యువత నిరాశ చెందారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏళ్ల కొద్దీ వాయిదా పడుతోన్న ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు పరిష్కారం చూపింది.

2లో..

## ఏపీలో వరద బాధితులకు బిగ్ రిలీఫ్

- పరిహారం అందనివారికి నేడు జమ
- బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్న అధికారులు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో వరద పరిహారం ఇంకా అందనివారికి బిగ్ రిలీఫ్ వివిధ కారణాల వలన వరద పరిహారం అందని వారికి సోమవారం పరిహారం పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. వరదల కారణంగా సుమారు నాలుగు లక్షల మంది ప్రభావితులయ్యారనే అంచనాతో ప్రభుత్వం వరద పరిహారం విడుదల చేసింది. మొత్తం రూ.602 కోట్లు విడుదల చేయగా ఇప్పటికే చాలా మందికి వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం మొత్తం జమైంది. అర్హులైన వారిలో ఇప్పటి వరకూ 98 శాతం మందికి పరిహారం జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మిగతా రెండు శాతం మందికి కూడా వివిధ కారణాలతో పరిహారం అందలేదని వారికి సోమవారం అందిస్తామని అధికారులు తెలిపారు. మరోవైపు వరద బాధితులకు పరిహారం అందించేందుకు ఏపీ ప్రభుత్వం రూ.602 కోట్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో రూ.18.69 కోట్లు మాత్రమే ప్రస్తుతం మిగిలి ఉంది. బ్యాంకు ఖాతాల అనుసంధానం సహా ఇతరత్రా సాంకేతిక కారణాలతో రెండు శాతం మంది అంటే 21,768 మంది బాధితులకు

2లో..

## ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేస్తాం

### - రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు

- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నమూనా విడుదల
- కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మంత్రులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు నెలకొల్పుతున్నామన్న భట్టి
- గత ప్రభుత్వం పేద విద్యార్థులను పట్టించుకోలేదన్న కోమటిరెడ్డి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 20 నుంచి 25 ఎకరాల్లో

2లో..

## బతుకమ్మకు అమెరికాలో అధికారిక గుర్తింపు

### - తెలంగాణ హెరిటేజ్ వీక్' పేరుతో సంబురాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు సూచిక తెలంగాణకు మాత్రమే సొంతమైన పూల కేళిక బతుకమ్మ పండుగ. పూలను పూజించే అత్యంత అరుదైన సంబురం బతుకమ్మ. ప్రకృతిలోనే పరమాత్మున్ని చూసుకుని పూలనే గౌరమ్మగా భావించి చేసుకునే తొమ్మిదిరోజుల మహా ఉత్సవం బతుకమ్మ.

2లో..

## బోనస్ బోగస్ చేశారు

### - రెండు లక్షల ఉద్యోగాలకు అతీగతీ లేదు

- అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసింది
- ఈ దసరాకు అలాయ్-బలాయ్ తీసుకుంటూ ఈ పని చేయండి
- రాష్ట్ర యవతకు మాజీ మంత్రి హరీష్ సూచన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దసరా పండుగ రానే వచ్చింది. ఇక దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపిస్తుంది. పండుగకు వచ్చే బంధుమిత్రులతో జనాల ఇళు కళకళలాడుతున్నాయి. అయితే దసరా పండుగ సందర్భంగా మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు యువతకు ఒక ఆసక్తికరమైన పిలుపునిచ్చారు. గత సంవత్సరం దసరా పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి తమ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ కు ఓటు వేయాలని గ్రామాలలో యువత ప్రచారం చేశారని హరీష్ రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను నమ్మి తమ భవిష్యత్తు కోసం ప్రచారం చేసిన యువత ఇప్పుడు ఒక్కసారి ఆలోచించాలని ఆయన ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయలేదని ఊళ్ళల్లో అవ్వ తాతలకు పెంచుతామన్న పింఛన్ పెంచలేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతు బంధును నిలిపివేశారని, ఇక రైతు భరోసా దిక్కే లేకుండా పోయిందని రైతులకు ఇచ్చే బోనస్ ను బోగస్ చేశారని హరీష్ రావు పేర్కొన్నారు. సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని 10 నెలలు గడిచిన అతీగతీ లేదని గుర్తు చేశారు తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి దానికి నీళ్లు వదిలారని 4 వేల రూపాయల నిరుద్యోగ భృతి ఏమైంది అంటూ గుర్తు చేశారు .ఇక గత దసరా సమయంలో కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో

2లో..

# హైదరాబాద్ టూ గోవా కొత్త రైలు ప్రారంభం

## - జెండా ఊపి ప్రారంభించిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సెలబ్రిటీలుగానీ, యువత, ఉద్యోగులు, వ్యాపారులు హైదరాబాద్ నుంచి గోవా వెళ్లాలని ప్లాన్ చేస్తుంటారు.

బట్ సెలబ్రిటీలకు, సౌండ్ పార్టీలకు గోవా ట్రిప్ ప్లాన్ చేయడంతో పాటు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుని ఈజీగా వెళ్లొస్తుంటారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నుంచి గోవాకు కొత్త రైలు సర్వీసును ప్రవేశపెట్టింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జెండా ఊపి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గోవాకు వెళ్లే రైలును ఆదివారం నాడు ప్రారంభించారు.

### - సికింద్రాబాద్ నుంచి రైలు 17039 సర్వీస్

సికింద్రాబాద్ నుంచి గోవా(వాస్కోడగామా)కు

2లో..



# బీజేపీ తరఫున ప్రచారం చేస్తా కానీ..

వచ్చే ఏడాదిలో ప్రధాని మోడీకి 75 ఏళ్లు నిండుతాయని ఇప్పటికైనా ప్రజలకు ఏమైనా చేయాలన్నారు ఢిల్లీ ఎన్నికలు రాబోతున్నాయని డిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు చేస్తామని బీజేపీ చెబుతోంది. హర్యానాలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏం చేసిందో చెప్పాలని అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఒరిగేదేమీ లేదన్నారు.

# మూసీ సుందరీకరణపై రేవంత్‌కూ ఎన్నో సమస్యలు

మూసీని ప్రక్షాళన చేసి డ్రైనేజీ కలవకుండా చేసి నదిని నదిలా ఉంచాలన్నది కేసీఆర్, వైఎస్ ప్లాన్. అది చేయాలంటే ఆక్రమణలు తొలగించాలి. అక్కడ ఉండేది అంతా పేదలే కాబట్టి.. వారికి ఖచ్చితంగా పునరావాసం చూపించాలి.

అలా చూపించడానికి కొన్ని వేల కుటుంబాలు ఉన్నాయి. అందుకే అది భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అయినా రేవంత్ అలా వారిని తరలించడమే కాకుండా మూసీ చుట్టూ ఆ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే లక్షన్నర కోట్ల ప్రణాళికలు వేస్తున్నారు. ఎన్ని విమర్శలు వస్తున్నా వెనక్కి తగ్గడం లేదు.

### పునరావాసానికి పది వేల కోట్లు అయినా ఇస్తామన్న రేవంత్

పునరావాసం చూపించాల్సిన వారికి రూ.పది వేల కోట్లు అయినా ఇస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇతర బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన వారు పేదల్ని రెచ్చగొట్టకండా వారి సమస్యకు పరిష్కారం చూపేందుకు కలసి రావాలని పిలుపునిస్తున్నారు. పేదలను మూసీలోనే ఉంచడం కన్నా వారికి పునరావాసం కల్పిస్తే నష్టమేమనిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో ప్రజా స్పందన ఎలా ఉన్నా రేవంత్ రెడ్డికి పెను సవాల్ ఎదురుగా ఉన్నట్లే. అందరూ మూసి రివర్ బెడ్ మీద ఇళ్లు కట్టుకుని ఉంటే ఖాళీ చేయడానికి సిద్దపడకపోవచ్చు వారందర్నీ ఒప్పించాలంటే ఎంతో కష్టపడాలి. ఆ తర్వాత నిధుల సమస్య ఎలాగూ వస్తుంది.

### ఒత్తిడి తట్టుకోలేక మధ్యలోనే వదిలేస్తారా.?

గత సీఎంలు కూడా మూసీని సుందరీకరించేందుకు మొదట్లోనే గట్టి ప్రయత్నాలు చేశారు. అడుగు ముందుకు వేసే కొద్దీ ఆ ప్రాజెక్టు చేపట్టడం చాలా కష్టమన్న భావనకు వచ్చి వదిలేశారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు ప్రాథమిక స్థాయిలో ఉన్నారు.

ఆయన లో ఉత్సాహం ఉంది. కానీ ఎదురవుతున్ నసవాళ్లు చిన్నవి కావు. వాటిని ఎదుర్కొని మందుకు వెళ్లాలంటే ఎన్నో శక్తియుక్తులు సమీకరించుకోవాల్సి ఉంటుంది. రేవంత్ రెడ్డి ఈ ఒత్తిడి అంతా తనకు ఎందుకని సేఫ్ గేమ్ ఆడాలని అనుకుంటే ఆయన కూడా మూసీ ప్రాజెక్టును పక్కన పెట్టే అవకాశం ఉంది. అదే జరిగితే మరో సీఎం టేకప్ చేసే వరకూ మూసీ నది మురికి కాలువలాగే ఉండిపోతుంది.

# 3 నెలలుగా జీతాలు వస్తలేవు

**- చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ వారికి హామీ ఇచ్చారు.**

**- నా ఉద్యోగం నాకు తిరిగి ఇప్పించండి సార్**

తనకు ఉద్యోగం తిరిగి ఇప్పించి ఆదుకోవాలాలని ఓ దివ్యాంగురాలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి విజ్ఞప్తి చేసింది. కడప జిల్లా కమలాపురం ల్యాబ్ లో గత 10 ఏళ్లు జి.సుజన కుమారి అనే దివ్యాంగురాలు హెల్పర్ గా పని చేస్తున్నారు. అయితే తనను 3 నెలల కిందట విధులు నుంచి తొలగించారని పవన్ కళ్యాణ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పుట్టుకతో ఒక కిడ్నీ లేదని, బరువులను ఎత్తే పనులు సైతం చేయకూడదని డిప్యూటీ సీఎం పవన్ కు తెలిపారు. కనుక బతకడానికి ఏ ఆధారం లేని తనకు తిరిగి ఉద్యోగం ఇప్పించాలని ఈ సందర్భంగా సుజన కుమారి వేడుకున్నారు. వెంటనే స్పందించి ఆయన అధికారులతో ఈ విషయమై మాట్లాడతానని ఆమెకు భరోసా ఇచ్చారు.

### సూపర్ సిక్స్ ను డైవర్ట్ చేయడానికి లడ్డూ పాలిటిక్స్ అని వైసీపీ ఫైర్

కాగా, సనాతన ధర్మం అంటూ రాజకీయాలు చేస్తున్న పవన్ కళ్యాణ్ ముందు తమకు ఓట్లు వేసి గెలిపించిన ఏపీ ప్రజల హామీలు నెరవేర్చాలని వైసీపీ నేతలు సెటైర్లు వేస్తున్నారు. తనకు సంబంధించిన శాఖల ఉద్యోగులకు ఏం సమస్యలు ఉన్నాయో కూడా మూడు నెలలైనా తెలుసుకోలేకపోయారని, పైగా వంద రోజుల కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడాన్ని తిరుమల లడ్డూ వివాదంతో డైవర్షన్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో సమస్యలు, పర్యావరణంపై ప్రేమతో, అట్టడుగు వర్గాల వారిని నేరుగా కలసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ ఏ వర్గానికి సాయం చేయడానికి ప్రయత్నాలు కూడా మొదలుపెట్టలేదంటూ వైసీపీ నేతలు, మాజీ మంత్రులు మండిపడుతున్నారు. అధికారం కోసం మహిళలకు నెలకు నగదు, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15000 ఇలా సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఇప్పుడు సనాతన ధర్మం, తిరుమల లడ్డూ అంటూ కాలయాపన చేస్తున్నారని వైసీపీ క్యాడర్ పోరాటానికి సిద్ధం కావాలని ఆ పార్టీ అధినేత జగన్ ఇదివరకే నేతలకు దిశానిర్దేశం చేశారు.

# కేసీఆర్ ఉద్యోగం పోయి పేదలకు ఉద్యోగాలు వస్తున్నాయి

అని రేవంత్ పేర్కొన్నారు.

### 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు

రాష్ట్రంలో 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలిచ్చి యువత తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం చూసే విధంగా చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 9వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో 11,063 మందికి టీచర్ల ఉద్యోగ నియామక పత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ఓ వైపు వందేళ్ల అనుభవం ఉంటే మరోవైపు పదేళ్ల దుర్మార్గం ఉందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం అనే ముసుగు వల్ల కేసీఆర్ ఎన్నో ఏళ్లు గౌరవం పొందారని అది ఉద్యమ ఘనతే తప్ప ఆయనది కాదని విమర్శించారు. నమ్మకంతో ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకుందామని అన్నారు.బి

### మూసీని ప్రక్షాళన చేస్తాం

ఇంజినీర్ల కృషి, గొప్పతనం ఈ సమాజానికి చాలా అవసరమని 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్ నిర్మాణం కాబోతున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. 55 కిలో మీటర్ల మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలబెడతామని చెప్పారు.

ఎయిర్ పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ నిర్మాణం కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'మూసీ అంటేనే మురికి కూపమనే పేరు స్థిరపడింది. ప్రజలు నిరాశ్రయులవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా.?. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, గంధమల్లు రిజర్వాయర్ల నిర్మాణం వల్ల ఎవరి భూములు పోలేదా.?. మల్లన్న సాగర్ పేరుతో రైతులను బలవంతంగా ఖాళీ చేయించారు. మూసీ నిర్వాసితులకు మంచి స్థలంలో ఆశ్రయం కల్పిస్తాం. నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహాలు ఇవ్వాలి.' అని సీఎం పేర్కొన్నారు.

# బోనస్ బోగస్ చేశారు

కాంగ్రెస్ కు ఓటు వేయాలని ప్రచారం చేసిన యువత ఇప్పుడు అలోచించాలన్నారు.ఈ దసరాకు మీ ఊర్లకు వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో అలాయ్ బలాయ్ తీసుకుంటూ కాంగ్రెస్ చేసిన మోసాల గురించి చర్చించాలని పేర్కొన్నారు.

అంతే కాదు దసరా పండగ సందర్భంగా మీ ప్రాంతాలలో ఉన్న కాంగ్రెస్ నాయకులను కూడా నిలదీయాలని, తమకు ఇష్టమని హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ లతోపాటు, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్ పై ప్రశ్నించాలన్నారు.

ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్, మైనారిటీ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్ ల పైన ఎక్కడికక్కడ కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని హరీష్ రావు తన ట్వీట్ ద్వారా యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు విషయంలో పదేపదే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూనే ఉన్నారు. సందర్భాన్ని బట్టి ప్రజలను కాంగ్రెస్ పార్టీ తీరును ఎండ కడుతున్నారు.

# ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేస్తాం

ఇంగ్లీష్ మీడియాలకు దీటుగా రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మించి నర్సరీ నుంచి ఇంటర్ వరకు మెరుగైన ఉచిత విద్య అందిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో చాలా రెసిడెన్షియల్ స్కూళ్లకు ఇప్పటివరకూ సొంత భవనాలు లేవని, ఇరుకైన బిల్డింగ్స్ లో ఈ స్కూళ్లు ఉన్నాయన్నారు.

### ప్రతి నియోజకవర్గంలో ఓ ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

రాష్ట్ర సచివాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ స్కూళ్లకు దీటుగా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లను నిర్మిస్తామని చెప్పారు. ఇది చాలా మంచి కార్యక్రమం కనుక దసరా పండుగ కంటే ముందే రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై స్పెషల్ ఫోకస్ చేసిందని, అందులో భాగంగా గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు భారీగా నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కాంప్లెక్సులను సాధ్యమైనంత త్వరగా నిర్మించి పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించనున్న ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ స్కూల్స్ కు సంబంధించిన ప్లాన్ మీద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ క్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర సీఎస్ శాంతికుమారి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్రంలో అద్దె భవనాల్లోనే రెసిడెన్షియల్ స్కూళ్లు

'సీనియర్ అధికారులతో ఓ కమిటీ వేశాం. కనీసం మూడు నెలల్లో వీటికి సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక చేసి ప్రభుత్వానికి అందిస్తారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు సరిగ్గాలేదు. 1023 రెసిడెన్షియల్ స్కూళ్లు 620 స్కూళ్లకు బిల్డింగ్ లేదు. బీసీ వెల్ఫేర్ 327 స్కూల్లు ఉంటే 306 స్కూల్లు అద్దె భవనంలో ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 268 ఉండగా అందులో 135 వరకు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. భవనాలు, మౌలిక వసతులు, టీచింగ్ ఫ్యాకల్టీ సరిగ్గా లేని కారణంగా విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. కనుక మేం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థపై, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యపై ఫోకస్ చేశాం. గత ప్రభుత్వం కేవలం రూ.73 కోట్లు ఖర్చు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం తాము రూ.5000 కోట్లు కేటాయిస్తున్నాం. మాకు మంచి అవకాశం దొరికింది అనుకునేలా పిల్లలు మంచి విద్యా సంస్థల్లో చదివేలా చూస్తామని' భట్టి విక్రమార్క పలు అంశాలను ప్రస్తావించారు. విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాదు ఆటలు, పాటలు, ఇతర టాలెంట్ వెలికితీసేలా విధానాన్ని అవలంభిస్తామని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినా స్కూల్ బిల్డింగ్స్ లేవు, సరైన విద్యా వసతి లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

### బతుకమ్మకు అమెరికాలో అధికారిక గుర్తింపు

అలాంటి బతుకమ్మ పండుగకు అరుదైన గుర్తింపు లభించింది. బతుకమ్మ సంబుర ప్రాశస్త్యాన్ని, పండగలోని పరమార్థాన్ని అమెరికాలో పలు రాష్ట్రాలు గుర్తించాయి. అమెరికాలోని నార్త్ కరోలినా, జార్జియా, వర్జీనియా రాష్ట్రాలు బతుకమ్మ పండుగకు అధికారికంగా గుర్తించాయి. అంతేకాదు బతుకమ్మ సంబరాల వారాన్ని బతుకమ్మ పండగ వారంగా, తెలంగాణ హెరిటేజ్ వీక్‌గా ప్రకటించాయి కూడా. ఈ మేరకు ఆయా స్టేట్ల గవర్నర్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బతుకమ్మ పండుగ ప్రశస్త్యం ఖండాంతరాలు దాటినట్టయింది. బతుకమ్మ పండుగ అనేది ఎంతో ప్రత్యేకమైన, ప్రాముఖ్యత ఉన్న పండుగల్లో ఒకటని ఈ ఉత్సవాన్ని 4 కోట్ల తెలంగాణ ప్రజలే కాకుండా అమెరికాలో స్థిరపడ్డ 12 లక్షల మంది ఎన్నారైలు కూడా ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారని జార్జియా, వర్జీనియా రాష్ట్రాల గవర్నర్లతో పాటు నార్త్ కరోలినాలోని ఛార్లెట్, రాలేహ్ మేయర్లలు అభివర్ణించారు. బతుకమ్మ అనేది ప్రకృతికి మానవజాతికి మధ్య ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయతను తెలియజేసే అద్భుతమైన సంబురమని కొనియాడారు. తెలంగాణ సమాజం నార్త్ కరోలినాకు ఎంతో కంట్రిబ్యూట్ చేసిందని తెలిపారు.ఈ క్రమంలోనే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ పండుగను అక్టోబర్ 01 నుంచి 09వ తేదీ వరకు అధికారికంగా జరుపుకోవాలని అక్కడి ప్రజలకు సూచించారు.

ఇప్పటికే తెలంగాణలోని ప్రజలు విశ్వవ్యాప్తంగా విస్తరించారు. అమెరికా, లండన్, బ్రిటన్, పారిస్, దుబాయి, సౌదీ అరేబియా ఇలా అన్ని దేశాల్లో తెలంగాణవాసులు స్థిరపడ్డారు. అయితే తెలుగు వారు ఎక్కడున్నా వారి సంస్కృతిని సంప్రదాయాలను ఎప్పుడూ మర్చిపోకుండా పాటిస్తుంటారు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రజలు కూడా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తుంటారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తమైంది. ముఖ్యంగా తెలంగాణ జాగృతితో పాటు తానా, మాటా లాంటి తెలుగు ఎన్నారైల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గనైజేషన్స్ కూడా ఆయా దేశాల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ వేడుకలకు అక్కడ నివసిస్తున్న తెలుగువారి నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో అక్కడి ప్రభుత్వాలు కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవటం గమనార్హం. ఈ క్రమంలోనే అమెరికాలోని ఆయా రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో తెలుగువారు స్థిరపడగా అందులో తెలంగాణ ప్రజలు కూడా గణనీయంగా ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే తెలంగాణకు మాత్రమే సొంతమైన బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహిస్తూ ఇక్కడి సంప్రదాయాలను అమెరికాలో కూడా పాటించారు. ఈ క్రమంలో అమెరికాలోని పలు రాష్ట్రాలు బతుకమ్మ ప్రాముఖ్యతను తెలుసుకుని ఈ నిర్ణయం తీసుకుంది.

# ఏపీలో వరద బాధితులకు బిగ్ రిలీఫ్

పరిహారం సొమ్ము జమ కాలేదు. ఈ నేపథ్యంలో వారి ఖాతాల్లో సోమవారం పరిహారం సొమ్ము జమచేస్తారు. ఈ బాధ్యతను ప్రభుత్వం స్థానిక కలెక్టర్లకు అప్పగించింది. 21,768 మంది బాధితుల్లో ఎన్టీఆర్ జిల్లాలో 15 వేలమంది, అల్లూరి జిల్లాలో 4,620 మంది సహా ఇతర జిల్లాలలో ఉన్నారు. వారికి జిల్లా అధికారులు బ్యాంకు అకౌంట్లలో డబ్బు జమ చేస్తారు. మరోవైపు విజయవాడ వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీగా నష్టం జరిగింది. ప్రాణనష్టంతో పాటుగా భారీ మొత్తంలో ఆస్తి, పంట నష్టం జరిగింది. ఇక వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బాధితులకు పరిహారం ప్యాకేజీ ప్రకటించింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటూ వరదనీటిలో మునిగిపోయిన కుటుంబాలకు రూ.25 వేలు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంటున్న వారికి రూ.10 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. అలాగే వరదల్లో చనిపోయిన కోళ్లు, పశువులకు, వ్యాపారులకు సైతం పరిహారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఇప్పటికే అర్హులైన వారి జాబితాను ప్రదర్శించి వారి అకౌంట్లలోకి డబ్బులు జమచేశారు. తాజాగా ఆధార్ అనుసంధానం సహా ఇతరత్రా సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన వారికి రేపు జమ చేస్తారు.

# హైదరాబాద్ టూ గోవా కొత్త రైలు ప్రారంభం

వెళ్లే ఈ కొత్త రైలు సర్వీసు హైదరాబాద్ నుంచి అక్టోబర్ 9, గోవాలోని వాస్కోడగామా నుంచి అక్టోబర్ 10వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఇదివరకు ఈ మార్గంలో రైలు సర్వీసు లేదా అంటే ఉంది. సికింద్రాబాద్- వాస్కోడగామా మధ్య రెగ్యులర్ సర్వీసు (ట్రెయిన్ నెంబర్ 17603) మంగళవారం, బుధవారం, శుక్రవారం, ఆదివారాల్లో సేవలు అందిస్తోంది. అయితే హైదరాబాద్, తెలుగు ప్రాంతాల నుంచి గోవాకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్త రైలు సర్వీసు ప్రారంభించారు. ఆ (17039) రైలు ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ నుంచి వాస్కోడగామాకు బయలుదేరుతుంది. అదే విధంగా (17040) రైలు ప్రతి గురు, శనివారాల్లో వాస్కోడగామా నుంచి సికింద్రాబాద్ కు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. తాజా రైలు సర్వీసులతో దేశంలో పర్యాటకానికి మరింత తోడ్పాడు అందుతుందని, దాంతోపాటు ఇక్కడి నుంచి గోవాకు వెళ్లే వారికి రైలు ప్రయాణం ఈజీ అవుతుంది.

## గోవాకు రైలు సర్వీసుపై ప్రయాణికులు హర్షం

సికింద్రాబాద్ నుంచి గోవా మధ్య రైలు సర్వీసుపై హైదరాబాద్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మామూలుగా తక్కువ సమయంలో గోవాకు వెళ్లాలంటే విమానంలో వెళ్లాల్సి ఉంటుంది. లేకపోతే కొంచెం ఖర్చు తగ్గించుకుని మనమే వాహనాలు బుక్ చేసుకుని గోవాకు వెళ్లాల్సి వస్తుంది. ద

అయితే తాజాగా ప్రవేశపెట్టిన గోవా రైలు సర్వీసులో తొలిసారి గోవాకు వెళ్తున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త రైలు సర్వీసుతో తక్కువ ధరకే రైలు టికెట్ కొని గోవాకు వెళ్తున్నామని కొందరు ప్రయాణికులు తెలిపారు. రైలులో సౌకర్యాలు బాగున్నాయని, గోవాకు వెళ్లాలనుకున్న తమ కల నెరవేరిందని భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రైలు అనగానే సామాన్యుడి వాహనం అని, సామాన్యుడి విమానం అని ఎన్నో చెబుతుంటారు. ఎందుకంటే తక్కువ ధరలకే సుదూర ప్రయాణాలు చేసేవారు కచ్చితంగా రైలు ప్రయాణాన్ని ఎంచుకుంటారు. విమానంతో పోల్చితే తక్కువ ధరలకే కుటుంబం మొత్తం ఏ ఇబ్బంది లేకుండా ప్రయాణం చేయవచ్చు అని చెబుతున్నారు.

# గ్రామ పాలనలో నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చెయ్యాలి.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



మంథని ( ప్రశ్న న్యూస్) ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు, స్కిల్ డెవలప్మెంట్ సర్వే అక్టోబర్ 10 లోపు పూర్తి చేయాలి మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల సర్దుబాటు ప్రకారం పనుల ప్రతిపాదనలు సమర్పించాలి ప్రతి గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్ నెలాఖరు వరకు పూర్తి స్థాయిలో పని చేయాలి మేజర్ గ్రామ పంచాయతీల పని తీరు పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ గ్రామ పాలనలో నిర్దేశిత లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి గ్రామ పంచాయతీల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను పరిశీలించి అక్టోబర్ 10 లోపు పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. చెరువుల ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ పరిధిలోకి లే ఔట్లు వస్తున్నాయో లేదో నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎల్.ఆర్.ఎస్ సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లను పలు మార్లు దరఖాస్తుదారులకు ఫోన్ చేసినప్పటికీ సమర్పించని దరఖాస్తులను షార్ట్ ఫాల్ పెట్టి రివర్ట్ చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీలలో పన్ను వసూలు చాలా తక్కువగా ఉందని, అక్టోబర్ నెలాఖరు వరకు నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు పన్ను వసూలు చేయాలని కలెక్టర్ పంచాయతి కార్యదర్శులకు సూచించారు. గ్రామ పంచాయతీలలో అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం చేపట్టాల్సిన ప్రాధాన్యత పనుల ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత కల్పించాలని, ప్రతిరోజు చెత్త సేకరణ జరగాలని, అక్టోబర్ నెలాఖరు వరకు సేగ్రిగేషన్ షెడ్ల పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీలోని మల్టీ పర్పస్ వర్కర్ల జీతాలు ప్రతి నెలా అందేలా చూడాలని అన్నారు. పంచాయతీలలో వ్యాపారం నిర్వహించే వారు ట్రేడ్ లైసెన్సులు పొందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఎంపీడీవో లు, ఎంపీఓ లు, పంచాయతీ సెక్రటరీ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ఎన్నికలు ఈ సారి రసవత్తరం

**- రాష్ట్ర ప్రధాన కార్యర్శి పదవి పోటీకి ముందంజలో**

**- పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్**



మంథని ( ప్రశ్న న్యూస్) పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర స్థాయి ఎన్నికలు ఈ సారి రసవత్తరంగా కొనసాగనున్నాయి. గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నిజామాబాద్ కు చెందిన బీరెల్లి కమలాకర్ రావు రిటైర్ కావడంతో ఆ పదవికి పలువురు పి ఆర్ టి యు టి ఎస్ నేతలు పోటీపడుతున్నారు.ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించి ఉపాధ్యాయులు నేడు అనుభవిస్తున్న సకల సౌకర్యాలు పి ఆర్ టి యు టి ఎస్ ద్వారానే సాధించబడ్డాయి అనేది అక్షర సత్యం. రాష్ట్రంలో అతి పెద్ద సంఘంగా పి ఆర్ టి యు టి ఎస్ ఉంది.ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రధాన కార్యదర్శి పోటీకి ఈ నెల ఏడు, ఎనిమిది తేదీలలో జరిగే ఎన్నికల్లో పోటిచేసేందుకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్, కామరెడ్డి జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి ల పేర్లు ముఖ్యంగా వినిపిస్తున్నాయి. వచ్చే సంవత్సర ప్రారంభంలో కరీంనగర్, వరంగల్ రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎం ఎల్ సి ఎన్నికలు ఉండడంతో ఈ ఎన్నికలు కీలకం కానున్నాయి. ఈ క్రమంలో కర్రు సురేష్ గ్రామీణ ప్రాంతం నుండి రాష్ట్ర స్థాయి నేతగా ఎదగడం,పెద్దపల్లి జిల్లాలో నిత్యం సామాన్య కార్యకర్తలకు అందుబాటులో ఉండడం, జిల్లాకు సంబందించిన ఉపాధ్యాయుల జిల్లా స్థాయి,రాష్ట్ర స్థాయి సమస్యలు అనేకం పరిష్కరించడం,రాష్ట్ర స్థాయిలో ఉన్న సీనియర్ లకు వారు తలలో నాలుకల వ్యవహరించడం, గత కరీంనగర్ ఉపాధ్యాయ ఎం ఎల్ సి ఎన్నిక విజయంలో వారు కీలక పాత్ర వహించడం, ఎం ఎల్ సి లు మాజీ ఎం ఎల్ సి లు మరియు రాష్ట్ర అగ్రనేతల ఆశీస్సులు వారికీ ఉండడం, రాష్ట్ర ఐ టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆశీస్సులు, అండదండలు కర్రు సురేష్ కి ఉండడం వారి గెలుపు నల్లేరు మీద నడకే అని ఉపాధ్యాయ వర్గాలు అనుకుంటున్నాయి.ఓ సి ల ఆధిపత్యం ఉండే పి ఆర్ టి యు టి ఎస్ లో ఈ సారైన బి సి వర్గం నుండి వస్తున్న కర్రు సురేష్ కు వారి అదినాయకత్వం అవకాశం ఇస్తుందో లేదో వేచిచూడాలి.

# టీచర్ అశ్లీల వీడియో సోషల్ మీడియాలో పోస్ట్.. నలుగురు స్టూడెంట్స్ అరెస్ట్

లక్నో: ఉపాధ్యాయురాలి అశ్లీల వీడియోను సోషల్ మీడియాలో విద్యార్థులు పోస్ట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేకంగా ఒక పేజీని తెరిచారు. దీంతో బాధిత టీచర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో నలుగురు స్టూడెంట్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆగ్రాకు చెందిన ఒక మహిళ, మధురలోని స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నది. చదువులో వెనుక ఉన్న పదో తరగతి విద్యార్థికి ప్రత్యేకంగా ట్యూషన్ చెప్పింది. చనువు ఏర్పడంతో టీచర్ అశ్లీల వీడియోను ఆ స్టూడెంట్ తన మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేశాడు. తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని ఆమెను బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో టీచర్ అతడికి దూరంగా ఉండసాగింది.కాగా, ఆ విద్యార్థి ఆగ్రహంతో రగిలిపోయాడు. టీచర్ అశ్లీల వీడియోను ముగ్గురు స్నేహితులకు పంపాడు. వారు దానిని వాట్సాప్‌లో మరికొందరికి షేర్ చేశారు. అలాగే వారంతా కలిసి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పేజీని క్రియేట్ చేశారు. బాధిత టీచర్‌కు ఈ విషయం తెలిసింది. దీంతో మిషన్ శక్తి అభయాన్ కేంద్రానికి వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. విద్యార్థుల వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసింది. మరోవైపు ఆ కేంద్రం మద్దతు, వారి ధైర్యంతో పోలీసులకు ఆ టీచర్ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో నలుగురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు మైనర్లా కాదా అన్నది ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బహిరంగంగా మూత్ర విసర్జన చేయవద్దన్నందుకు.. దారుణంగా కొట్టిన వ్యక్తి

న్యూఢిల్లీ: బహిరంగంగా మూత్ర విసర్జన చేయవద్దన్న వ్యక్తిని మరో వ్యక్తి దారుణంగా కొట్టాడు. ఫుట్‌పాత్‌పై నిద్రించిన ఆ వ్యక్తిని గుర్తించిన తర్వాత కర్రతో దాడి చేశాడు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. గురువారం మోడల్ టౌన్ ప్రాంతంలోని పార్క్ వద్ద ఆర్యన్ అనే వ్యక్తి బహిరంగంగా మూత్ర విసర్జన చేయడంపై రాంఫాల్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కాగా, ఆ తర్వాత ఆర్యన్ తన స్నేహితులతో కలిసి బైక్‌పై ఆ ప్రాంతానికి వచ్చాడు. ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న రాంఫాల్ దుప్పటి తొలగించి అతడ్ని గుర్తించాడు. అనంతరం చేతిలో ఉన్న కర్రతో దారుణంగా కొట్టాడు. అక్కడి నుంచి వెళ్తూ మళ్లీ వెనక్కి వచ్చాడు. నిల్చొని బాధతో అల్లాడిపోయిన రాంఫాల్‌ను మళ్లీ చితకబాదాడు. ఆ వీధిలోకి ఒక కారు రావడం చూసిన ఆర్యన్ తన ఫ్రెండ్స్ బైక్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పోలీసులు స్పందించారు. రాంఫాల్‌ను కర్రతో దారుణంగా కొట్టిన ఆర్యన్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టగా బెయిల్‌పై విడుదలైనట్లు తెలుస్తున్నది.

# శ్రీ గిరి క్షేత్రం లో వివిధ అలంకరణలతో దేవి వైభవం

**- కూష్మాండ దుర్గ అవతారంలో భక్తులకు అమ్మవారి అనుగ్రహం**
**- కైలాసవాహనం మీద పార్వతి మాత ముక్కంటిఈశ్వరుడి దర్శనం**
**- నేడు స్కందమాత రూపంలో స్వామి అమ్మవార్ల ఉత్సాహం**





**శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)** దసరా మహోత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి.అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి. అదేవిధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన,చండీ హోమం జరిపించబడుతాయి.కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీపూజలు జరుగనున్నాయి.కుమారీ పూజ దసరామహోత్సవాలలో భాగంగా ప్రతీరోజు కుమారీ పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ కుమారిపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం కూష్మాండదుర్గ అలంకారం ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగాశ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని కూష్మాండదుర్గ స్వరూపంలో అలంకరింపజేయడం జరుగుతుంది.నవదుర్గలలో నాల్గవ రూపమైన ఈ దేవి ఎనిమిది భుజాలను కలిగి ఉంటుంది. అందుకే ఈమెను అష్టభుజాదేవి అని కూడా పిలుస్తారు. సృష్టి లేకుండా ఈ జగత్తంతా చీకటిమయంగా ఉన్నప్పుడు, ఈ కూష్మాండదుర్గ బ్రహ్మాండాన్ని సృష్టించింది. ఈ కారణంగా ఈమె సృష్టికి ఆది స్వరూపిణిగా కూడా కీర్తించబడుతోంది.కూష్మాండదేవిని ఆరాధించడం వల్ల రోగాలన్నీ నివారించబడి, ఆరోగ్యం చేకూరుతుంది. ఇంకా ఆయువు, యశస్సు వృద్ధి చెందుతాయని కూడా చెప్పబడుతోంది.కైలాస వాహనసేవ ఈ ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా ఈ రోజు కైలాస వాహనసేవ జరిపించబడుతుంది.ఈ వాహనసేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, కైలాసవాహనంపై వేంచేబు చేయించి పూజాదికాలు చేయబడుతాయి.

## ఉపాధ్యాయ ఎన్నికల్లో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పోటీలో కర్రు సురేష్




**మంథని ( ప్రశ్న న్యూస్)** ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమాన్పూర్ మండల్ పెద్దంపేట గ్రామంలో కర్రు రాజమ్మ మల్లయ్య పుణ్య దంపతులకు నాలుగో సంతానంగా జన్మించిన కర్రు సురేష్ ఈన విద్యాభ్యాసం ఒకటి నుంచి ఆరో తరగతి వరకు మమత హై స్కూల్ మంగళపల్లిలో ఏడో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల చందనాపూర్లో కొనసాగించుకుంటూ పదవ తరగతి వాల్మీకి కరీంనగర్ విద్యాలయంలో చదివి కరీంనగర్ మంచిర్యాల ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ డిగ్రీ పూర్తి చేసుకొని ఉస్మానియా యూనివర్సిటీలో భౌతిక శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి బీఈడీ అది ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసుకుని గవర్నమెంట్ టీచర్ పోస్ట్ సాధించి అంచలంచలుగా ఎదిగి గ్రామీణ ప్రాంత లో ఎదిగి తెలంగాణ పిఆర్టియులో సభ్యత్వం తీసుకొని అరంగేట్రం చేసి సంఘం బలోపేతం కావడానికి మండల స్థాయి డివిజన్ స్థాయి జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ నేతగా ఉపాధ్యాయ సేవే తత్పరతతో అంకితభావంతో కృషిచేసి ఆయన సేవలను పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం గుర్తించి ఇలాంటి నేత మాకు అవసరమని అందరితో ప్రేమగా కలుపుగోలుగా ఐకమత్యంగా మన్ననలు పొందిన కర్రు సురేష్ ను రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ ఎన్నికల్లో భారీ మెజార్టీతో భారీ మెజార్టీతో తన అమూల్యమైన ఉపాధ్యాయ ఓటు వేసి అందరూ ఐకమత్యంగా భారీ మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరుకుంటున్నాడు అభ్యర్థిగా పిఆర్టియు సంఘం అధినాయకత్వం వర్తమాన సమకాలిక అంశాలను గ్రహించి రాజకీయ వ్యూహాలను అర్థం చేసుకొని బీసీ నాయకత్వానికి రాష్ట్రస్థాయి నాయకత్వం కర్రు సురేష్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ఎన్నికల్లో విజయదొందిపి మోగించాలని పి ఆర్ టి యు కోరుకుంటుంది అభిమానులు మేధావులు రాజకీయ విశ్లేషకులు రాజకీయ ఉద్దండులు శ్రీధర్ బాబు అండదండలు ఈయనకు గొప్పగా ఉన్నాయి అని ఇలాంటి కార్యక్రమములో ఇట్లాంటి మంచి మనసున్న వ్యక్తిని బలపరిస్తే ఉపాధ్యాయ సంఘాలలో ఎన్నో సమస్యలు ఉన్న చాకచక్యంగా పని చేయడంలో తాను ముందు ఉంటాడని తన తోటి ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు.


# మల్లన్న సేవలో కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఏపీ న్యాయమూర్తి వెంకట ప్రతాప

శ్రీశైలం ( ప్రశ్న న్యూస్) శ్రీశైల మల్లికార్జున స్వామి భ్రమరాంబ అమ్మవార్ల దర్శనార్థం వెంకట ప్రతాప కు శ్రీశైలం విచ్చేసిన సందర్భంగా ముందుగా ఆలయ మర్యాదల ప్రకారం శ్రీశైలం దేవస్థానం ఈఓ పెద్ది రాజు స్వాగతం పలకడం జరిగింది. అనంతరం స్వామి అమ్మ వార్లను ఆలయ రాజగోపురం ద్వారా ప్రత్యేక దర్శనం ద్వారా వెంకట ప్రతాప దర్శించుకోవడం జరిగింది. ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం శేష వస్త్రాలు,లడ్డు ప్రసాదాలు, వేద పండితుల ఆశీర్వాదాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె వెంట అధికారులు మరియు వేద పండితులు పలువురు అధికారులు పాల్గొనడం జరిగింది.




## దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చేష్ యాదవ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలోని ఆదిశక్తి పరాశక్తి అయిన దుర్గా భవాని మాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ చల్లగా ఉండాలని బిజెపి మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చేసి యాదవ్ కోరారు. ఆదివారం నాడు పెద్ద చింతకుంట గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించడం అదృష్టంగా భావిస్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని అలాగే దేదీప్యమానంగా గ్రామమంతా వెలసిల్లాలని ఆయన కోరుకున్నారు. శ్రీ భవాని మాత వార్షికోత్సవాన్ని పురస్కరింకొని . దీంతో గ్రామ యువకులు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ పూజా కార్యక్రమంలో పాల్గొని మాత కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ గోడ రాజేందర్ , దుర్గామాత కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ, జి నాగేష్, డి నరసింహులు , జి దుర్గేశ్, కె నాగభూషణం , పి మల్లేశం గౌడ్, టి రాజు, పి దుర్గేష్, పి రాజు, జి లక్ష్మీ నరసయ్య, కే రాజు, పి దుర్గేష్, పి ఆనంద్ గౌడ్, ఎం మలేష్ యాదవ్, టీ దుర్గేష్, టి నరేష్, ఏం పర్వతాలు, ఎం అరుణ్ యాదవ్, జి అరవింద్, సాయికుమార్, డి మధు, తదితరులు పాల్గొన్నారు.

## అపోలో రీచ్ ఎన్ ఎస్ ఆర్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్



పరకాల (ప్రశ్న న్యూస్) పరకాల పట్టణంలో అపోలో రీచ్ ఎన్ ఎస్ ఆర్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా వివిధ రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు న్యూరో సర్జన్ డాక్టర్ అభిలాష్ ,ఆర్థోపెడిక్ డాక్టర్ దిలీప్ కుమార్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ కుమార్ మరియు ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు . ఈ క్యాంపులో ఉచిత బిపి, షుగర్, ఈసీజీ వంటి ఇతర రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది మరియు ఉచిత మందుల పంపిణీ కూడా చేశారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి దాదాపుగా వెయ్యి మంది పైగా ఉచిత వైద్య శిబిరం ద్వారా సేవలు అందుకున్నారు. ఇలాంటి వివిధ రకాల వైద్య శిబిరాలు ముందు ముందు ఇంకా ప్రజలకి అందుబాటులో ఉంటాయని ,అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వైద్య బృందం తెలియజేసారు.

## శ్రీశైల క్షేత్రం లో శాశ్వత అన్నప్రసాద వితరణకు కు రూ.లక్ష విరాళం

**దాతకు బాండు అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు టీ. హిమబిందు**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్ ) శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కు కృష్ణ సుధాకర్ ఒంగోలు వాస్తవ్యులు 1,00,000/-విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు టి హిమబిందు కు అందజేశారు. దాతకు స్వామి అమ్మవార్ల దర్శనం దేవస్థానం తరపున స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు లడ్డూ ప్రసాదం అందజేశారు

## ఈటల రాజేందర్ నోరు అదుపులో పెట్టుకో లేకపోతే ఖబర్దార్..!!

**మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ బుడ్డ భాగ్యరాజ్ %ౖ% డాక్టర్ అప్సర్ %ౖ% గరిగేనర్సింగరావు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఈటెల రాజేందర్ దిగజారి మాట్లాడుతున్నారని ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ మండిపడ్డారు దేశంలో నియంతలు శాడిస్టులు, సైకోలు ఎవరో దేశ ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. 25 రోజుల్లో 18 వేలకోట్ల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్ రెడ్డిని సైకో అంటే అన్నం పెట్టే రైతులను గాలికి వదిలేసి పెట్టుబడిదారులకు పట్టం కడుతున్న మోదీని ఏమని పిలవాలో ఈటెల రాజేందర్ చెప్పాలన్నారు గుజరాత్ సబర్మతి రివర్ ఫ్రంట్ లో ఇండ్లు కోల్పోయిన 1000 కుటుంబాలకు పునరావాసం కల్పించకుండా బిజెపి సర్కార్ గాలికి వదిలేసింది నిజం కాదా అని ప్రశ్నించారు ఈటల రాజేందర్ చౌకబారు విమర్శలతో తన స్థాయిని తగ్గించుకోవద్దని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ హితువు పలికారు.

## లలిత త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం



నాగోల్ (ప్రశ్న న్యూస్) దేవీ శరన్నవరాత్రులలో భాగంగా నాలుగోవ రోజు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచింది. ఈ సందర్భంగా అల్కాపురి శ్రీ విద్యా శక్తి పీఠం లో దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ నారాయణం చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వేత్తలు గాయిత్రి వెంకట భరత్ కుమార్ సమక్షంలో ఆదివారం పంచదశాక్షరీ మహామంత్రం అధిష్ఠాన దేవతగా లలితా త్రిపురసుందరిని ఆరాధించారు. పీఠం కు వచ్చిన సామాన్య భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, గణపతి పంచాదశి సహిత రుద్ర హోమం, శ్రీ చక్ర అర్చన లో బాగంగా విశేషమైనట్టి 8 సంవత్సరాల బాలిక కు బాల పూజలు నిర్వహించి మూల మంత్రం తో లలిత అమ్మవారిని అవాహనం చేసి బాలిక ను అమ్మవారి గా భావించి భక్తులకు దీవెనలు అందించారు. అలాగే ఎనిమిది మంది ముత్తైదువులకు కూడా అమ్మవారి ని అవాహణ చేసి వచ్చిన భక్తుల చే పాద పూజ లు చేయించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గోసంటి శివప్రసాద్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామాన్య భక్తులు ఎవరైనా పీఠం లో అమ్మవారికి పూజలు నిర్వహించ వచ్చని, నిత్యాన్నదానం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు తెలిపారు.

## శ్రీ వారాహిదేవి పూజల్లో పాల్గొన్న కేఎస్ఆర్



కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) భక్తులు కోరిన కోర్కెలను తీర్చే కొంగు బంగారంలా విరజిల్లుతున్న నిజాంపేట్ లోని వెలసినటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 4వ రోజైన ఆదివారం అమ్మవారిని అర్చకులు శ్రీ వారాహిదేవి అమ్మవారుగా అలంకరించగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఎన్ఎంసి కాంగ్రెస్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డిలు శ్రీ వారాహి దేవిగా అవతారం ఎత్తిన అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థ ప్రసాదలు స్వీకరించి అనుగ్రహం పొందారు. అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, కొలన్ లక్ష్మారెడ్డి, నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కు స్వాగతం పలికిన యశ్వంత్



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బర్కత్‌పురా బాగ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం లో భాగంగా అంబర్‌పేట్ డివిజన్ న్యూ పటేల్ నగర్ లో నిర్వహించిన కవాతుకు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఏ. యశ్వంత్, దయాకర్ యాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని యువతకు సనాతన ధర్మాన్ని, బోధిస్తున్నారని, రాబోయే రేపటి యువ భారతావనికి నేటి యువత మార్గదర్శకం కావాలని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో యువత ముందుండాలని ఈ సందర్భంగా అన్నారు.

# సంస్కారాలు



గృహస్థు పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్య సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవయోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు. సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే. గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

# వజ్రాల సీతాకోక చిలుకల బ్యాగు.. విలువెంతో తెలుసా!



రోమ్: సాధారణంగా ఓ హ్యాండ్ బ్యాగు ఖరీదు 500 రూపాయల నుంచి ప్రారంభమై వేలల్లో ఉంటుంది. ఇక కొన్ని ప్రత్యేకమైన బ్రాండ్స్‌కు చెందిన ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగుల విలువ లక్షల్లో ఉంటుంది. కానీ ఇటలీకి చెందిన ఓ బ్యాగుల కంపెని ఇటివల తయారు చేసిన బ్యాగు విలువ తెలిస్తే అందరూ నోళు వెల్లబెట్టాల్సిందే. అలిగేటర్(మొసలి జాతికి చెందిన) చర్మంతో తయారు చేసిన ఈ చిన్న బ్యాగు విలువ రూ. 53 కోట్లు అంట. దీంతో ప్రస్తుతం ఇది ప్రపంచంలోని అత్యంత ఖరీదైన బ్యాగు అయ్యింది. అయితే దానికి ఎందుకు అంతా ఖరీదు అని ఆలోచిస్తున్నారు. ఎందుకంటే ఈ బ్యాగును వజ్రాలు, మరకత మాణిక్యాలతో పాటు విలువైన రాళ్లతో అలంకరించారు. దీనిని బోరిని మిలానేసి అనే లగ్జరీ లెదర్ హ్యాండ్ బ్యాగుల కంపెనీ తయారు చేసింది. చూడగానే కళ్లు చెదరిలా తయారు చేసిన ఈ బ్యాగును అలిగేటర్ చర్మంతో తయారు చేసిన ఈ బ్యాగుపై తెల్లరంగు బంగారంతో తయారు చేసిన 11 సీతాకోక చిలుకలను అమర్చారు. ఈ సీతాకోక చిలుకలపై మొత్తం 30 క్యారట్ల వజ్రవైఢూర్యాలు, అరుదైన మరకత మాణిక్యాలను పొదిగారు. అయితే ఈ బ్యాగు తయారు చేసేందుకు దాదాపు 1000 గంటలకు పైగా సమయంలో పట్టిందని ఈ సంస్థ వెల్లడించింది. దీనితోపాటు ఇలాంటివే మరో రెండు బ్యాగులను కూడా ఈ సంస్థ తయారు చేసింది. కాగా ఖరీదైన ఈ హ్యాండ్ బ్యాగులను మహాసముద్రాల కాలుష్యంపై అవగాహన కలిగించేందు కోసమే తయారు చేసినట్లు బోరిని మిలానేసి సంస్థ తెలిపింది. వీటి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును సముద్ర కాలుష్య నివారణకు వినియోగిస్తామని ఈ సంస్థ వెల్లడించింది. అయితే దీనిని ఇంతవరకు ఎవరూ ఖరీదు చేయలేదని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచలోనే అంత్యంత ఖరీదైన ఈ బ్యాగును ఏ సంపన్నులు సొంతం చేసుకుంటారో వేచి చూడాలి.

# పుష్కరతుంగ... భద్రగంగ



జలాన్ని దేవతా రూపంలో తల్లిగా భావించి పూజించడం హిందువుల సంప్రదాయం. నదీస్నానాలు, కోనేటి స్నానాలు, మంగళ స్నానాలు, సముద్ర స్నానాలు... అలాగే తీర్థ యాత్రలు, పుణ్య క్షేత్రాలు దర్శనం... సమస్తం నీటితో ముడిపడి వున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్య ప్రదమని హిందువుల విశ్వాసం. సకల జీవరాశులకు ప్రధానమైన జలస్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు. 'తుంగే పానీ.. గంగే స్నానే' అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం! అసలు తుంగభద్ర నది ఎలా ఏర్పడిందో తెలుసుకుందాం. హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రంలో వేయగా శ్రీ మహావిష్ణువు వరాహావతారమెత్తి తన కోరలతో భూమిని సాగరం నుండి పైకెత్తి సర్వజీవులనూ రక్షించాడు. తుంగ (ఎత్తు) నుండి రావడం వల్ల తుంగానదిగానూ, హిరణ్యాక్షుని సంహరించే సమయంలో వరాహరూపుడైన విష్ణువు కుడి కోర నుండి కారిన లాలాజలం భద్రానదిగానూ ఉద్భవించాయి.పుష్కరాలు జరిగే 12 నదులలో తుంగభద్ర ఒకటి. రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు 2008 లో జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఇవే. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని, ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.ప్రముఖ దేవాలయాలను తాకుతూ వెళుతున్న తుంగభద్ర..కర్ణాటక: శృంగేరి (చిక్మగుళూరు), పంపావతి దేవాలయం(కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి).ఆంధ్రప్రదేశ్: రాఘవేంద్రస్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుండ్రేవుల).తెలంగాణ: సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం. తుంగ, భద్ర నదులు కలసి కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తాయి. ఈ రెండు నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది.

# చేపలో ఎన్ని పోషాకాలున్నాయో.. తెలుసా...?

హైదరాబాద్ : చేపల పులుసే కాదు, చేపల వేపుడు కూడా అద్భుతంగానే ఉంటుంది. అయితే ఏదో ఒక రూపంలో చేపలను వారంలో కనీసం 2 లేదా 3 సార్లు తీసుకుంటే మనకు అనేక అద్భుతమైన లాభాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.వయస్సు మీద పడడం వల్ల ఎవరికైనా సహజంగానే మతిమరుపు వస్తుంటుంది. కొందరికి ఇది తీవ్రతరమై అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అలాంటి సమస్య ఉన్నవారు చేపలను తినడం వల్ల ఆ సమస్య నుంచి బయట పడవచ్చని 2016లో పలువురు అమెరికన్ సైంటిస్టులు చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. చేపలను తినడం వల్ల మెదడు బాగా పనిచేస్తుందట. జ్ఞాపకశక్తి పెరుగుతుందని వారు చెబుతున్నారు.–చేపలను బాగా తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో ఓ అధ్యయన వివరాలను ప్రచురించారు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో ఉండే ట్రై గ్లిజరైడ్లను తగ్గిస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. –చేపలను తరచూ తినడం వల్ల వాటిల్లో ఉండే డోపమైన్, సెరొటోనిన్ అనే హార్మోన్లు డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది. –చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. అలాగే పెద్దపేగు, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పాంక్రియాటిక్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లు రాకుండా ఉంటాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ఓ అధ్యయ వివరాలను ప్రచురించారు.



# ప్రకృతిని పరిరక్షించుకోకపోతే విపత్తులు తప్పవు

- తిండిగింజలు - 2.3 కోట్ల టన్నులు - కూరగాయలు - 2.1 కోట్ల టన్నులు - ఏటా మనం వృథా చేస్తున్న ఉత్పత్తులు (ఆహార శుద్ధీకరణ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం...)
- పండ్లు- 1.2 కోట్ల టన్నులు - ఈ వృథా మొత్తం విలువ - 440 కోట్ల డాలర్లు (రూ. 32,329 కోట్లు) - ఈ ఆహార వృథా ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను కూడా పరిగణనలోకి తీసుకుంటే విలువ: 1,060 కోట్ల డాలర్లు(రూ. 77,885 కోట్లు)

**68 శాతం..** 1970 - 2016 మధ్యకాలంలో తగ్గిపోయిన క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలు, సరిస్పృపాలు, చేపల సంతతి

**49 శాతం..** భారత్‌లో కేవలం రెండేళ్లలోనే కాలుష్యం బారిన పడ్డ నదీ ప్రవాహాలు. ఢిల్లీలో యమున, దామన్ లోని దామన్ గంగ, ముంబైలోని మీఠీ, హరియాణాలో గగ్గర్, గంగా నదిలోని పలు ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**భారత్‌లో క్షీణత...** క్షీరదాల సంతతిలో తగ్గుదల 12 శాతం. కప్పల వంటి ఉభయ చరాల్లో 19 శాతం క్షీణత. పక్షుల్లో 3 శాతం తగ్గుదల.

**85 శాతం..** మనిషి కోల్పోయిన చిత్తడినేలల విస్తీర్ణం

**1,000** గంగ నదీ పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, ఇతర జల వనరుల ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆనకట్టల సంఖ్య

**3** తాబేళ్ల వినాశనం విషయంలో భారత్ ర్యాంకు. చైనా, వియత్నాంలో మనకంటే ఎక్కువ విధ్వంసం జరుగుతోంది!

**21.000** లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ)లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గమనిస్తున్న జంతుజాలాల సంఖ్య

**0.03 శాతం..** దేశ భౌగోళిక విస్తీర్ణంలో చిత్తడి నేలలు.

**2,500** మన జీవనదుల్లో మిగిలిన గాంజెటిక్ డాల్ఫిన్ల సంఖ్య!

**82 కోట్లు** దేశంలోని 12 నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య ఎదుర్కొంటున్న జనాభా.

**గొరిల్లాలు.. బూడిద రంగు చిలకలు** ప్రమాదం అంచుల్లోన ఉన్న జంతుజాలంలో ఇవి రెండు మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.

హరివిల్లులో ఏడు రంగుల స్థానంలో ఒక రంగు మాత్రమే ఉంటే? భూమ్మీద తెల్లటి పూలు మాత్రమే పూస్తే? పండ్లు అన్నింటి రుచి ఒకేలా ఉంటే? అబ్బే... ఏం బాగుంటుంది అంటున్నారా? నిజమే. అన్నీ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది! వైవిధ్యం అనేది మనసుకు ఆనందం కలిగిస్తుంది! ప్రయోజనాలూ బోలెడు! కానీ.. ఈ విషయం మనిషికి పూర్తిగా అర్థమైనట్లు లేదు. ఎందుకంటే.. మన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందని తెలిసినా... వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ తదితరాల పేరుతో.... అడవులు, నదులు, సరస్సులు, నేలలను నాశనం చేస్తూనే ఉన్నాడు! వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సిద్ధం చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ –2020 చెబుతున్నది ఇదే! కోవిడ్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. కోట్ల కేసులు.. లక్షల్లో మరణాలు... ఆర్థిక వ్యవస్థ ఛిద్రం.. ఉద్యోగాల కోత. ఇలా ఎన్నెన్నో సమస్యలకు ఒక వైరస్ కారణమైందంటే ఆశ్చర్యం అనిపించక మానదు. కానీ.. కోట్ల సంవత్సరాలపాటు జంతువుల్లో నిక్షేపంగా బతికిన ఈ వైరస్‌లు ఈ మధ్య కాలంలో మనిషికి ఎందుకు సంక్రమిస్తున్నాయో.. కారణమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? హెచ్1ఎన్1 కానివ్వండి, చికెన్ గున్యా కానివ్వండి. స్వైన్‌ఫ్లూ కానివ్వండి అన్నీ జంతువుల నుంచి మనిషికి సోకిన వ్యాధులే. ఇప్పుడు కోవిడ్%--%19 కూడా. మనిషి ఎప్పుడైతే అటవీ సంపదను తన స్వార్థం కోసం విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడో అప్పటి నుంచే ఈ సమస్య కూడా పెరగడం మొదలైందని అంటారు నిపుణులు.ప్రకృతిని, జీవజాలాన్ని పరిరక్షించుకోవడం ఇప్పటికైనా నేర్చుకోకపోతే కోవిడ్%--%19 తరహా విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ %--%2020లో స్పష్టం చేసింది. రెండేళ్లకు ఒకసారి విడుదల చేసే లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌ను ఈసారి దాదాపు 125 మంది నిపుణులు కలిసి సిద్ధం చేశారు. 1970 నుంచి 2016 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 21 వేల క్షీరదాలు, పక్షులు, జలచరాలు, సరిసృపాలు సంతతిని పరిశీలిస్తూ సిద్ధం చేసిన ఈ నివేదిక దాదాపు 164 పేజీల నిడివి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పరిశీలించిన వాటిల్లో మూడింట రెండు వంతుల జంతుజాలం క్షీణావస్థలో ఉంది. మొక్కల విషయానికొస్తే... ప్రతి ఐదింటిలో ఒకటి అంతరించిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది ఉష్ణమండల ప్రాంతాల్లోని అడవులనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆరుసెకన్లకు రెండు ఎకరాల చొప్పున నష్టపోయామని నివేదిక తెలిపింది. అడవులు నరికివేసి వ్యవసాయం చేయడం మొదలుకొని నదీజలాల కాలుష్యంతో జలచరాలకు ముప్పు తేవడం వరకూ అన్నింటి ఫలితంగా భూమి ఇప్పుడు అత్యవసర సాయం కోరుతూ ఆక్రందనలు చేస్తోందని వివరించింది. ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోతే ఇంకో పదేళ్లలో సరిచేసుకునేందుకు వీలు కానంత పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించింది. అయితే ఇప్పటికైనా పరిస్థితి మించిపోలేదని, దేశాలన్నీ కలిసికట్టుగా పచ్చ'ధనం' పండిస్తే.. వినియోగం విషయంలో మనల్ని మనం మార్చు కోగలిగితే భూమి మరికొన్ని కాలాలపాటు పచ్చగా ఉండేందుకు అవకాశం లేకపోలేదని చెబుతోంది ఈ నివేదిక.

**ఇవీ కారణాలు** భూ వినియోగంలో మార్పులు. అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతూ ఉండటం, జంతుజాలాల ఆవాస యోగ్య ప్రాంతాలు కుంచించుకుపోవడం జీవవైవిధ్యం తగ్గుదలకు ఒక కారణం. ప్రకృతి వనరుల విచ్చలవిడి వాడకం రెండో కారణం. ఇన్వేసివ్ స్పీషీస్ (ఇతర జీవావరణాల నుంచి వచ్చిన జంతువులు, పక్షులు, మొక్కలు) మూడో కారణం. నాలుగవ, ఐదవ కారణాలుగా కాలుష్యం, వాతావరణ మార్పులను పేర్కొనవచ్చు. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జీవ వైవిధ్యతలో తగ్గుదలకు ప్రధానంగా వాటి ఆవాస ప్రాంత నష్టం కారణం కాగా.. ఇన్వేసివ్ స్పీషీస్, వ్యాధులు, అతి వాడకం ఇతర కారణాలుగా కనిపిస్తున్నాయి. భారత్‌లో నగరీకరణ, వ్యవసాయ కార్యకలాపాలు, కాలుష్యం వంటి కారణాల వల్ల చిత్తడి నేలలు దాదాపు లేకుండా పోయాయని లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ రిపోర్ట్ స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాలు తగ్గడంతో జంతు సమూహాల్లోని సంఖ్య కూడా తగ్గిపోతోందని, ఇది కాస్తా సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతోపాటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది భారత్‌లో అటవీ భూములను ఇతర అవసరాల కోసం మళ్లించాలన్న అభ్యర్థనలు దాదాపు 240 వరకూ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాగా.. సుమారు 99 శాతం ప్రతిపాదనలకు అనుమతి లభించిందని ఈ నివేదిక తెలిపింది.

**సమీకృత విధానంతోనే పరిష్కారం...** వేగంగా తగ్గిపోతున్న జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నా, తద్వారా మానవ మనుగడను మరింత సుస్థిరం చేసుకోవాలన్నా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాల్సిందే. ఆహార ఉత్పత్తిని, వాణిజ్యాన్ని మరింత ప్రకృతి అనుకూలమైన పద్ధతుల్లో చేపట్టడం ఇందులో ఒకటి మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో కనీసం మూడో వంతు వృథాగా చెత్తబుట్టల్లోకి చేరుతుండటం జీవవైవిధ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ వృథా కారణంగా గాల్లోకి చేరుతున్న విషవాయువులు వైమానిక రంగ ఉద్గారాల కంటే ఎక్కువగా ఆరు శాతం వరకూ ఉండటం గమనార్హం. ఆహార రంగం ద్వారా వెలువడుతున్న విషవాయువుల్లో 24 శాతం సరఫరా నష్టాలు, వినియోగదారులు వృథా చేయడమేనని నివేదిక తెలిపింది. ఈ నష్టాలన్నింటినీ తగ్గించుకోగలిగితే జీవవైవిధ్యం పెంపునకు తోడ్పడినట్లే. భారత్ విషయానికి వస్తే.. ఉత్పత్తి అవుతున్న ఆహారంలో వృథా అవుతున్నది దాదాపు 40 శాతం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఈ నష్టాన్ని 10 నుంచి 15 శాతంగా మాత్రమే చెబుతున్నా అంతర్జాతీయ సంస్థలు 40 శాతంగా లెక్కవేస్తున్నాయి. జంతుజాలాన్ని, ప్రకృతిని పరిరక్షించడం జీవవైవిధ్యం కోసం కీలకమైనప్పటికీ కేవలం ఈ చర్యల ద్వారా మాత్రమే పరిస్థితిని పారిశ్రామిక విప్లవం మునుపటి స్థాయికి తీసుకువెళ్లలేమని వీటికి ఇతర అంశాలూ కూడా జోడిస్తేనే మేలు జరుగుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.



# పెరుగు, కీరా.. ఫహాడీ రైతా.. అరగంట ఫ్రిజ్‌లో సర్వ్ చేసుకుంటే!

పెరుగు, కీరా కలగలసిన ఫహాడి రైతా తయారీ విధానం తెలుసా?



### ఫహాడి రైతా తయారీకి కావల్సినవి

పెరుగు రెండు కప్పులు,కీరా ఒకటి,ఆవాలు టీస్పూను,పచ్చిమిర్చి రెండు,ఆవ నూనె పావు కప్పు,కొత్తిమీర గుప్పెడు,కారం టీస్పూను,పసుపు అరటీస్పూను,ఉప్పు రుచికి సరిపడా.

### తయారీ...

తొక్క, గింజలు తీసిన కీరాను సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి.పెరుగును పెద్దగిన్నెలో వేసి కవ్వంతో చిలకాలి.
తరువాత పావు కప్పు నీళ్లుపోసి కలపాలి.ఇప్పుడు ఆవాలు, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా దంచుకోవాలిదంచిన మిశ్రమం, కీరా తరుగుని చిలికిన పెరుగులో వేయాలి.పసుపు, కారం కూడా వేసి చక్కగా కలుపుకోవాలి.దీనిని అరగంటపాటు రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత సర్వ్ చేసుకోవాలి.

# ఉత్తరాఖండ్ వంటకం

## ఆలుకీ గుట్కే తయారీ ఇలా!

### ఆలుకీ గుట్కే



ఉత్తరాఖండ్ వంటకం ఆలుకీ గుట్కే ఇలా తయారు చేసుకోండి.
**ఆలుకీ గుట్కే తయారీకి కావలసినవి:**బంగాళ దుంపలు మూడు,ఆవనూనె రెండు టీస్పూన్లు,కారం పావు టీస్పూను,ధనియాలపొడి రెండు టీస్పూన్లు,జీలకర్ర పావు టీస్పూను,పసుపు పావు టీస్పూను,ఎండు మిర్చి రెండు,ఇంగువ రెండు చిటికెలు,ఉప్పు రుచికి సరిపడా,కొత్తిమీర తరుగు గార్నిష్‌కు సరిపడా.
**తయారీ...:**కొద్దిగా ఉప్పువేసి బంగాళ దుంపలను ఉడికించాలి.ఉడికిన దుంపల తొక్క తీసి ముక్కలు తరగాలి.చిన్న గిన్నెలో ధనియాల పొడి, కారం, పసుపు, రెండు టీస్పూన్ల నీళ్లుపోసి చక్కగా కలపాలి.స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేయాలి. నూనె కాగాక జీలకర్ర, ఇంగువ, కారం వేసి అరనిమిషం పాటు వేయించాలి.ఇప్పుడు బంగాళ దుంపల ముక్కలు, కలిపి పెట్టుకున్న మసాలా మిశ్రమం, రుచికి సరిపడా ఉప్పు వేసి ఐదు నిమిషాలపాటు వేయించాలి.చివరిగా కొత్తిమీర చల్లుకుని దించేయాలి.

# శుక్లం శాపం,

## దృష్టి లోపం.. కారణాలు, లక్షణాలు, చికిత్స

కంటిశుక్లం అత్యంత విలువైన కంటి చూపును తగ్గించే తీవ్రమైన సమస్య. దీనిపై ప్రజలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. ఇది నిదానంగా పెరిగే సమస్య కావడం వల్ల చాలామంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తద్వారా సమస్య తీవ్రత పెరిగేందుకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కంటి శుక్లం శస్త్రచికిత్స/క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరం...పై అపోలో స్పెక్ట్రా ఆసుపత్రికి చెందిన వైద్యులు, ప్రముఖ క్యాటరాక్ట్ సర్జన్ డా. అల్పా అతుల్ పూర్బియా అందిస్తున్న సమాచారం ఇది...కంటి శుక్లం..కారణాలు...కంటి లెన్స్ పుట్టుకతో స్పష్టంగా ఉంటుంది, ప్రధానంగా నీరు మరియు ప్రోటీన్లతో కూడి ఉంటుంది. ప్రోటీన్లు కాలక్రమేణా విచ్ఛిన్నం కావడంతో, లెన్స్ తెల్లగా లేదా బూడిద రంగులోకి మారడం ప్రారంభిస్తుంది, ఇది స్పష్టమైన చూపును నిరోధిస్తుంది. దీనికి సాధారణంగా వయస్సు పెరగడం కాగా, అతినీలలోహిత కిరణం/సూర్య కాంతికి గురికావడం వంటివి కూడా కంటిశుక్లంను ప్రేరేపించడానికి కారణాలే. ఇక ఇతర కారణాలలో అతిగా ధూమపానం, దీర్ఘకాలిక మధుమేహం, దీర్ఘకాలిక స్టెరాయిడ్స్ వాడకం వంటివి కూడా ఉండవచ్చు. అలాగే ఆల్కహాల్ దుర్వినియోగం, ఊబకాయం, రేడియేషన్ థెరపీ మొదలైనవి కూడా ఉన్నాయి. ప్రమాదవశాత్తు కంటికి అయిన గాయాలు కూడా కంటిశుక్లం వృద్ధికి కారణం కావచ్చు. కొన్ని సార్లు పుట్టుకతో కూడా కంటిశుక్లం వచ్చే అవకాశం ఉంది. చాలా అరుదుగా పిల్లలలో అభివృద్ధి చెందే కంటిశుక్లంని డెవలప్‌మెంటల్ క్యాటరాక్ట్ అంటారు.గుర్తించాల్సిందే...కంటిశుక్లం నిదానంగా అభివృద్ధి చెందే గుణం కలిగి ఉంటుంది కాబట్టి ముందుగా జాగ్రత్త పడడం కష్టమవుతుంది. దీనిని ముందుగా గుర్తించడానికి రాత్రిపూట దృష్టికి అంతరాయం, తక్కువ కాంతిలో చూడటం కష్టతరం అవడం వంటి లక్షణాలు ఉపకరిస్తాయి. కంటి శుక్లం ఉన్న రోగులు సాధారణంగా లైట్ చుట్టూ ఒక కాంతిని చూస్తారు. అలాగే కంటి శుక్లం ఉన్నప్పుడు ప్రకాశవంతమైన లైట్ల మెరుపు బాధాకరంగా ఉంటుంది, కంటిశుక్లం ఉన్న వ్యక్తులు ప్రకాశవంతమైన సూర్యకాంతిలో సరిగ్గా చూడటం కష్టంగా ఉండవచ్చు లేదా రాత్రి సమయంలో కొన్నిసార్లు మరింత చెదిరిన దృష్టిని గమనించవచ్చు. వారికి ఇండోర్ లైట్లలో కూడా చూపు కష్టంగా ఉండవచ్చు. వీధి లైట్లు ఎదురుగా వచ్చే వాహనాల నుండి వచ్చే హెడ్‌లైట్ల వల్ల కలిగే కాంతి



కారణంగా రాత్రి సమయంలో డ్రైవింగ్ సమస్యగా మారవచ్చు. కంటిశుక్లం బాగు చేసేందుకు మందులతో చేయగలిగిన వైద్య చికిత్స లేదు. మసకబారిన చూపును, దృష్టిని పునరుద్ధరించడానికి శస్త్రచికిత్స ద్వారా కంటిశుక్లం తొలగించడమే మార్గం. . కంటిశుక్లం లక్షణాలు స్వల్పంగా ఉన్నట్లయితే, అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్స్ అవసరం కావచ్చు, కానీ కాలక్రమేణా కంటిశుక్లం మరింత తీవ్రమవుతుంది. తర్వాత తర్వాత సాధారణ రోజువారీ కార్యకలాపాలకు కూడా ఇది ఆటంకం కలిగిస్తే శస్త్రచికిత్స చేయక తప్పదు. కంటిశుక్లం తొలగింపు శస్త్రచికిత్స ప్రక్రియను ఇంట్రాకోక్యులర్ లెన్స్ ఇంప్లాంటేషన్స్ తో ఫాకోఎమల్సిఫికేషన్ అంటారు. ఈ ప్రక్రియలో, కంటిశుక్లం వృద్ధి చెందిన అసలు లెన్స్, కృత్రిమ (ఇంట్రాకోక్యులర్ లెన్స్)తో భర్తీ చేయబడుతుంది. ఇది చాలా సురక్షితమైన ప్రక్రియ. ఈ శస్త్రచికిత్స తర్వాత కొన్ని రోజుల పాటు దురద, తేలికపాటి అసౌకర్యం కంటిలో నీరు కారడం వంటివి కనిపించవచ్చు.అయితే నేడు అందుబాటులో ఉన్న తాజా సాంకేతికతతో విజువల్ రికవరీ చాలా వేగంగా ఉంది. శస్త్రచికిత్స తర్వాత కోలుకునే కాలం ఒకరి నుండి మరొకరికి భిన్నంగా ఉండవచ్చు. కొంతమంది కొద్ది రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు, మరికొందరికి కోలుకోవడానికి వారాలు పడుతుంది. ఇతరత్రా సమస్యలు లేనట్లయితే వైద్యులు ఒక వారం విశ్రాంతిని సిఫార్సు చేస్తారు. సాధారణంగా అయితే కొన్ని గంటలలోపే, కంటిలో కాలుష్యం లేదా ధూళి కణాలు ప్రవేశించకుండా నిరోధించడానికి రోగిని రక్షించే గ్లాస్ లేదా కంటికి ఐ ప్యాడ్‌తో ఇంటికి తిరిగి పంపుతారు.

# వంట నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారా?

## ఎంత డేంజరో తెలుసా..

పెదవాల్తేరు(విశాఖపట్నం): ఇంట్లోను, హొటళ్లలోను ఒకసారి వినియోగించిన వంట నూనెను పదేపదే ఉపయోగించడం పరిపాటి. కానీ అలా చేయడం ఆరోగ్యానికి హానికరం అన్న విషయం చాలా మందికి తెలియదు. దీనిపై ఇప్పుడిప్పుడే అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. వాడిన వంటనూనెతో తయారైన ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులు, లివర్ జబ్బులు, హైపర్‌టెన్షన్, అల్జీమర్ వంటి వ్యాధులు సోకుతాయని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.చదవండి: మీకు తెలుసా?.. విద్యుత్ శాఖ నుంచి మెసేజ్‌లు రావు .కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన ఎన్‌ఎస్‌ఆర్ ఇండస్ట్రీస్ ఒకసారి వాడిన వంట నూనెను కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే విశాఖలోని పలు హొటళ్లలోను, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లలోను వాడిన వంటనూనె సేకరణ కోసం డ్రమ్ములు కూడా ఏర్పాటు చేశారు. లీటర్ అయిల్‌కు రూ.30 వంతున చెల్లిస్తారు. అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హొటల్ యజమానులు వాడిన వంటనూనె విక్రయాల కోసం సదరు సంస్థను సంప్రదించాలని ఆహార భద్రత శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ నూనె సాయంతో బయోడీజిల్ తయారు చేస్తారు. ఫలితంగా పెరుగుతున్న చమురు ధరల నుంచి ఉపశమనం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



# ఆరిక అన్నం అత్యంత

## బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం..

ఆరిక అన్నం ఇంటిల్లపాదికీ అత్యంత బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం. ఖరీఫ్‌లో మాత్రమే సాగయ్యే చిరుధాన్య పంట ఆరిక మాత్రమే. ఆరిక 160–170 రోజుల పంట. విత్తిన తర్వాత దాదాపు 6 నెలలకు పంట చేతికి వస్తుంది. ఆరికలు విత్తుకోవడానికి ఆరుద్ర కార్తె (జూలై 5 వరకు) అత్యంత అనువైన కాలం.మొలిచిన తర్వాత 40–50 రోజులు వర్షం లేకపోయినా ఆరిక పంట నిలుస్తుంది. ఇతర పంటలు అంతగా నిలవ్వు. చిరుధాన్యాల్లో చిన్న గింజ పంటలు (స్మాల్ మిల్లెట్స్).. ఆరిక, కొర్ర, సామ, ఊద, అండుకొర్ర. ఆరిక మినహా మిగతా నాలుగు పంటలూ 90–100 రోజుల్లో పూర్తయ్యేవే.చిరుధాన్యాల సేంద్రియ సాగులో అనుభవజ్ఞుడు, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయకుమార్ ‘సాక్షి సాగుబడి’కి వివరించారు. సేంద్రియ పద్ధతుల్లో ఆరికల సాగులో మెలకువలను ఆయన మాటల్లోనే ఇక్కడ పొందుపరుస్తున్నాం...ఆరిక విత్తనాలు ఒక్క వర్షం పడి తేమ తగలగానే మొలుస్తాయి. ఒక్కసారి మొలిస్తే చాలు. గొర్రెలు తిన్నా మళ్లీ పెరుగుతుంది ఆరికె మొక్క. మొలిచిన తర్వాత దీర్ఘకాలం వర్షం లేకపోయినా తట్టుకొని బతకటం ఆరిక ప్రత్యేకత. మళ్లీ చినుకులు పడగానే తిప్పుకుంటుంది. అందువల్ల సాధారణ వర్షపాతం కురిసే ప్రాంతాలతో పాటు అత్యల్ప వర్షపాతం కురిసే ప్రాంతాలకూ ఇది అత్యంత అనువైన పంట. నల్ల కంకి సమస్యే ఉండదు. ఆరిక పంటకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు అవసరం లేదు. పొలాన్ని దుక్కి చేసుకొని మాగిన పశువుల దిబ్బ ఎరువు ఎకరానికి 4–5 ట్రాక్టర్లు(12 టన్నులు) వెదజల్లాలి. లేదా గొర్రెలు, మేకలతో మందగట్టడం మంచిది. గొర్రెలు, మేకలు మూత్రం పోసిన చోట ఆరిక అద్భుతంగా దుబ్బు కడుతుంది. శ్రీవరి సాగులో మాదిరిగా 30–40 పిలకలు వస్తాయి. పొలాన్ని దుక్కి చేసి పెట్టుకొని.. మంచి వర్షం పడిన తర్వాత ఆరికెలను విత్తుకోవాలి. వెదజల్లటం కన్నా గొర్రుతో సాళ్లుగా విత్తుకోవడం మంచిది. గొర్రుతో విత్తితే విత్తనం సమాన లోతులో పడుతుంది. ఒకరోజు అటూ ఇటుగా మొలుస్తాయి. ఒకేసారి పంటంతా కోతకు వస్తుంది. 8 సాళ్లు ఆరికలు విత్తుకొని, 1 సాలు కందులు, మళ్లీ 8 సాళ్లు ఆరికలు, ఒక సాలు ఆముదాలు విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆరిక విత్తనం కావాలి. కంది విత్తనాలు ఎకరానికి ఒకటిన్నర కిలోలు కావాలి. కిలోన్నర కందుల్లో వంద గ్రాములు సీతమ్మ జొన్నలు, 50 గ్రాములు తెల్ల / చేను గోగులు కలిపి విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆముదం విత్తనాలు కావాలి. ఎకరానికి పావు కిలో నాటు అలసందలు /బొబ్బర్లు, అర కిలో అనుములు, వంద గ్రా. చేను చిక్కుళ్లు ఆముదాలలో కలిపి చల్లుకోవాలి. ఆరికలు విత్తుకునేటప్పుడు కిలో విత్తనానికి 4 కిలోల గండ్ర ఇసుక కలిపి విత్తుకోవాలి. ఆరికల విత్తనాలు ఎంత సైజులో ఉంటాయో అదే సైజులో ఉండే ఇసుక కలిపి గొర్రుతో విత్తుకోవాలి. కందులు, ఆముదం తదితర విత్తనాలను అక్కిలి / అక్కిడి కట్టెలతో విత్తుకోవాలి. ఆరికలను మిశ్రమ సాగు చేసినప్పుడు పెద్దగా చీడపీడలేమీ రావు. కషాయాలు పిచికారీ చేయాల్సిన అవసరం రాదు.ఐదారు రకాల పంటలు కలిపి సాగు చేయడం వల్ల చీడపీడలు నియంత్రణలో ఉంటాయి. రైతు కుటుంబానికి కావాల్సిన అన్ని రకాల పంటలూ చేతికి వస్తాయి. ఆహార భద్రత కలుగుతుంది. కంది, సీతమ్మ జొన్న తదితర పంట మొక్కల పిలకలు తుంచేకొద్దీ మళ్లీ చిగుర్లు వేస్తూ పెరుగుతాయి. పక్షి స్థావరాలుగా కూడా ఇవి ఉపయోగపడతాయి. ఆరికలు ఎకరానికి ఎంత లేదన్నా 6–8 క్వింటాళ్లు, కందులు 3 క్వింటాళ్లు, ఆముదాలు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సందేహాలుంటే విజయకుమార్ (98496 48498)ను ఆంధ్రప్రదేశ్ రైతులు ఉ. 6–9 గం. మధ్యలో, తెలంగాణ రైతులు సా. 6–9 గం. మధ్య సంప్రదించవచ్చు.



# పంచదార, తేనె, ఆలివ్ ఆయిల్, నిమ్మ.. దెబ్బకు జిడ్డు వదులుతుంది!

### ఓజిగట వదిలించే స్క్రబ్

వర్షాకాలంలో పేరుకుపోయిన మృతకణాలతో ముఖం జిగటగా ఉంటుంది. ఈ జిగటను తొలగించే స్క్రబ్‌ను ఇంట్లోనే అత్యంత సులువుగా తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం...కప్పు పంచదారలో టీస్పూను తేనె, అరటీస్పూను నిమ్మరసం, టీస్పూను ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా అప్లై చేసి ఆరిన తర్వాత సున్నితంగా మర్దన చేసి నీటితో కడిగేయాలి.వారంలో రెండు సార్లు ఈ స్క్రబ్ అప్లై చేయడం వల్ల జిగటపోయి ముఖచర్మం ఆరోగ్యంగా, కాంతిమంతంగా కనిపిస్తుంది.

### సహజమైన క్లెన్సర్స్

ముఖం మరీ మురికిగా అనిపిస్తే పాలు, మీగడ, పెరుగు, మజ్జిగ ఏది అందుబాటులో ఉంటే దానిని పట్టించి మెల్లగా రుద్దాలి. ఇవి సహజమైన క్లెన్సర్స్.మార్కెట్‌లో దొరికే క్లెన్సింగ్ మిల్క్‌కు బదులుగా వీటిని వాడవచ్చు.రోజూ మామూలుగా ముఖాన్ని శుభ్రం చేస్తున్నప్పటికీ దుమ్ముకణాలు చర్మం లోపలి గ్రంథుల్లోకి వెళ్లి చర్మానికి పట్టేస్తాయి.అలాంటప్పుడు కూడా ఈ క్లెన్సర్‌ను వాడవచ్చు.



# ఈ అమ్మాయిని చూసి...

## అడవి ముచ్చటపడింది!

పిల్లలు ఇష్టంగా చదువుకుంటుంటే పెద్దలే కాదు ప్రకృతి కూడా ముచ్చటపడుతుంది. నిండు మనసుతో ఆశీర్వదిస్తుంది!‘నిద్ర సుఖం ఎరగదు’ అంటారు. విద్య కూడా అంతే! ఏసీ గదులలో, మెత్తని సోఫాలలో కూర్చుని చదివితేనే చదువు వస్తుందని ఏమీ లేదు. ఇలా ఎండలో, రాళ్లపై కూర్చొని చదువుకుంటే కూడా చదువు వస్తుంది. అదంతా మన ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. విషయంలోకి వెళితే..హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక అమ్మాయి ప్రకృతి ఒడిలో పాఠ్యపుస్తకం చదువుకుంటున్న ఫోటో పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రాను బాగా ఆకట్టుకుంది. ‘మన్‌డే మోటివేషన్స్’ ట్యాగ్‌లైన్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఇన్‌స్పిరేషనల్ పోస్ట్ నెటిజనులను బాగా ఆకట్టుకుంది.‘ఈరోజు నేను హిమాచల్‌ద్రేశ్‌లోని సత్నా ప్రాంతానికి వెళ్లాను. అక్కడ చూసిన ఒక దృశ్యం నన్ను ఆశ్చర్యానందాలకు గురి చేసింది. ఒక అమ్మాయి శ్రద్ధగా చదువుకుటోంది. నోట్స్ రాసుకుంటోంది. పచ్చటి ప్రకృతి ఆమెను దీవిస్తున్నట్లుగా ఉంది. నిజం చెప్పాలంటే... ఈ దృశ్యాన్ని వర్ణించడానికి మాటలు దొరకడం లేదు’ అంటూ రాసి మురిసిపోయాడు దూబే.‘నిజానికి పిల్లలకు నాలుగు గోడల మధ్య కాకుండా పచ్చటి ప్రకృతి మధ్యే విద్య నేర్పించాలి. ఇలా చేస్తే వారికి ప్రకృతి విలువ తెలుస్తుంది. పర్యావరణ స్పృహ బాల్యం నుంచే కలుగుతుంది. గోడలు లేని బడిలో మనసు విశాలం అవుతుంది. తాత్విక విద్యావేత్తలు ఇదే విషయాన్ని చెప్పారు’ అంటుంది ఒక యూజర్.పెద్దల పోరు భరించలేక చదువుకుంటున్నట్లు కాకుండా... చాలా ఇష్టంగా చదువుకుంటున్నట్లుగా ఉంది.



# 'మాన్వత్ మర్డర్స్' (సోనీలివ్) వెబ్ సిరీస్ రివ్యూ!



మరాఠీలో 'మాన్వత్ మర్డర్స్' వెబ్ సిరీస్ రూపొందింది. ఆశిష్ అవినాష్ దర్శకత్వం వహించిన సిరీస్ ఇది. 1970లలో మహారాష్ట్రలోని 'మాన్వత్'లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ సిరీస్ నిర్మితమైంది. 8 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఈ నెల 4వ తేదీ నుంచి వివిధ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్ ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం. అది మహారాష్ట్రలోని 'మాన్వత్' గ్రామం. అక్కడ 8 నెలలలో 7 మర్డర్స్ జరుగుతాయి. చనిపోయిన వాళ్లంతా ఆడపిల్లలు .. మహిళలు. ఎవరు చంపుతున్నారు? ఎందుకు చంపుతున్నారు? అనేది ఎవరికీ అర్థం కాదు. దాంతో పొద్దుపోతే బయటికి వెళ్లడానికి మహిళలు భయపడిపోతుంటారు. హంతకులను పోలీసులు పట్టుకోకపోవడం విమర్శలకు దారితీస్తుంది. దాంతో స్పెషల్ ఆఫీసర్ గా ఆ ఊరికి రమాకాంత్ కులకర్ణి (అశుతోష్ గోవారికర్) వస్తాడు. సాధ్యమైనంత త్వరగా హంతకులను పట్టుకోవాలనే ఉద్దేశంతో, అక్కడి పోలీస్ స్టేషన్ లోని సిబ్బందిని కులకర్ణి పరుగులు పెట్టిస్తాడు. హత్యలు ఎక్కడెక్కడ జరిగాయి? ఏ పద్ధతిలో జరిగాయి? శవాలు ఎక్కడ కనిపించాయి? అనే విషయాలను తెలుసుకుంటూ ఇన్వెస్టిగేషన్ లో కులకర్ణి మునుకు వెళుతూ ఉంటాడు. ఆఫీసర్స్ హోదాలో అక్కడ పనిచేసే శుక్లా - పరాంజీ మధ్య మనస్పర్థలు ఉన్నప్పటికీ, కులకర్ణి అంటే ఉన్న భయం వలన జాగ్రత్తగా మసలుకుంటూ ఉంటారు. ఆ గ్రామంలో శ్రీమంతులుగా ఉత్తమ్ రావు - శ్రీరంగం ఉంటారు. ఉత్తమ్ రావుకి ఇద్దరు భార్యలు. రెండో భార్య రుక్మిణికి సంతానం ఉండదు. ఈ విషయంలో ఆమె చాలా అసంతృప్తిగా ఉంటుంది. ఆమెకి 'సమింద్రి' అనే ఒక చెల్లెలు ఉంటుంది. సమింద్రిపై ఉత్తమ్ రావుకి కన్ను ఉంటుంది. ఈ విషయంలో ఆమెపై రుక్మిణి కోపంగా ఉంటుంది. ఉత్తమ్ రావు నాటుసారా బిజినెస్ చేస్తూ ఉంటాడు. ఆ వ్యవహారాలను సమింద్రినే దగ్గరుండి చూసుకుంటూ ఉంటుంది. ఇక శ్రీరంగం విషయానికి వస్తే, సొంత ఊళ్లో అతనికి పొలాలు .. వ్యాపారాలు ఉంటాయి. ఒకటి రెండు శవాలు ఆయన పొలాల్లో దొరుకుతాయి. అంతే కాకుండా ఆయన పొలంలో నిధులు ఉన్నాయనీ, వాటిని బయటికి తీయడానికి క్షుద్ర పూజలు చేయించాడనే గుసగుసలు వినిపిస్తూ ఉంటాయి. 'కాజూ' అనే ఒక క్షుద్ర మాంత్రికుడి పేరు తెరపైకి వస్తుంది. దాంతో అతణ్ణి పట్టుకోవడానికి కులకర్ణి టీమ్ రంగంలోకి దిగుతుంది. హత్య చేసిన తరువాత శవాల నుంచి హంతకులు రక్తాన్ని సేకరించినట్టుగా తెలుస్తుంది. దాంతో ఇది కచ్చితంగా క్షుద్ర మాంత్రికుల పనే అనే విషయం కులకర్ణికి అర్థమవుతుంది. దాంతో అతను 'కాజూ'ని తనదైన స్టైల్లో విచారణ జరుపుతారు. అప్పుడు గణపతి పేరు తెరపైకి వస్తుంది. గణపతి ఎవరు? జరిగిన హత్యలకు అతనికి సంబంధం ఉంటుందా? కులకర్ణి ఏం చేస్తాడు? ఆ ఏడు హత్యలు ఎవరు చేస్తారు? ఎందుకు చేస్తారు? అనేది కథ. 1970లలో మహారాష్ట్రలోని 'మాన్వత్'లో జరిగిన యథార్థ సంఘటనలను ఆధారంగా చేసుకుని రూపొందించిన వెబ్ సిరీస్ ఇది. ఈ కథను 8 ఎపిసోడ్స్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకుని వచ్చారు. మొదటి ఐదు ఎపిసోడ్స్ చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగుతాయి. 6-7 ఎపిసోడ్స్ కాస్త డల్ గా అనిపిస్తాయి. 8వ ఎపిసోడ్ కరెక్టుగా వెళుతుంది. హత్యలకు సంబంధించిన అంశాలను రివీల్ చేసే ఎపిసోడ్ ఇది. 70లలో జరిగే కథ కావడం వలన, కథనాన్ని కాస్త స్లోగా నడిపించారేమో అనిపిస్తుంది. 6-7 ఎపిసోడ్స్ లో కథనం జోరు తగ్గినప్పటికీ, దర్శకుడు తాను చెప్పదలచుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పడం మనకి కనిపిస్తుంది. ఇక ఈ సిరీస్ లో పాత్రల సంఖ్య కాస్త ఎక్కువే. అయినప్పటికీ ఎక్కడా కన్ఫ్యూజ్ చేయకుండా ఆ పాత్రలను కనెక్ట్ చేశారు. ప్రతి పాత్రకి ప్రత్యేకత ఉంటుంది .. వెంటనే రిజిస్టర్ అవుతాయి. 5 ఎపిసోడ్స్ వరకూ పతి ఎపిసోడ్ నెక్స్ట్ ఏం జరగనుందనే కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. కాకపోతే హింస ఎక్కువగానే కనిపిస్తుంది. ఇది క్రైమ్ థ్రిల్లర్ అయినప్పటికీ, దర్శకుడు ఈ సిరీస్ ను సస్పెన్స్ తో ముందుకు తీసుకుని వెళుతూ .. డ్రామాను నడిపించడంలో సక్సెస్ అయ్యాడు.సత్యజిత్ శోభ - శ్రీరామ్ ఫొటోగ్రఫీ, సాకేత్ కనిత్కర్ నేపథ్య సంగీతం మెప్పిస్తాయి.ఫైసల్ ఎడిటింగ్ బాగుంది. 6 -7 ఎపిసోడ్స్ అనుకున్న స్థాయిలో పరిగెత్తవు. ఆ సమయంలో కాస్త ఓపిక పడితే, క్రైమ్ థ్రిల్లర్ కథలు నచ్చేవారికి ఈ సిరీస్ కూడా నచ్చుతుంది.

## బ్రేకప్ చెప్పుకుందామని మెసేజ్ పెట్టాడు..

# నేను షాక్ అయ్యాను: జెనీలియా

సినీ నటి జెనీలియా గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. 'బొమ్మరిల్లు' వంటి ఎన్నో తెలుగు చిత్రాల్లో నటించిన ఆమె... తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమే. 2002 నుంచి ఆమె బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్ ముఖ్ తో ప్రేమ వ్యవహారంలో ఉంది. 2012లో వీరు పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. తాము ప్రేమలో ఉన్నప్పుడు రితేశ్ చేసిన ఒక చిలిపి పని గురించి తాజాగా జెనీలియా పంచుకుంది. ఒకరోజు అర్ధరాత్రి తర్వాత... మనం బ్రేకప్ చెప్పుకుందామని రితేశ్ మెసేజ్ పంపాడని... దాన్ని చూసి తాను షాక్ అయ్యానని జెనీలియా చెప్పింది. ఎంతో బాధతో మరుసటి రోజు రితీశ్ నిద్ర లేవడం కోసం ఎదురు చూశానని... మరుసటి రోజు ఉదయం రితేశ్ ఫోన్ చేసి ఏం చేస్తున్నావని అడిగాడని తెలిపింది. ద

ఇక మనం మాట్లాడుకోకపోవడమే బెటర్ అని తాను చెప్పానని... ఎందుకు అలా మాట్లాడుతున్నావని తనపై రితేశ్ అరిచాడని చెప్పింది. మెసేజ్ గురించి తాను చెప్పగా... కేవలం జోక్ గా మెసేజ్ పంపానని, ఆ రోజు ఏప్రిల్ ఫస్ట్ కావడంతో అలా మెసేజ్ పెట్టానని రితేశ్ చెప్పాడని తెలిపింది. ఆ తర్వాత అంతా బాగానే ఉందని చెప్పింది. రితేశ్ ని పెళ్లి చేసుకోవడం తన జీవితంలో తాను తీసుకున్న అత్యుత్తమ నిర్ణయాలలో ఒకటని తెలిపింది.




## నేను ఏదైనా ప్రాబ్లంకి కనెక్ట్ అయితే"...

# గోపీచంద్ 'విశ్వం' థియేట్రికల్ ట్రైలర్ విడుదల

- గోపీచంద్, కావ్యా థాపర్ జంటగా 'విశ్వం'
- అదిరిపోయే రేంజిలో థియేట్రికల్ ట్రైలర్
- అక్టోబరు 11న 'విశ్వం' గ్రాండ్ రిలీజ్



గోపీచంద్, కావ్యా థాపర్ జంటగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనెపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ చిత్రం నుంచి థియేట్రికల్ ట్రైలర్ రిలీజైంది. శ్రీను వైట్ల ట్రేడ్ మార్క్ ఎంటర్టయిన్ మెంట్ కు లోటు లేదని థియేట్రికల్ ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. గోపీచంద్ కు ఉన్న యాక్షన్ ఇమేజ్ ను దృష్టిలో ఉంచుకుని పవర్ ఫుల్ ఎలిమెంట్స్ ను జోడించినట్టు ట్రైలర్ చెబుతోంది. కామెడీ సరేసరి... వెన్నెల కిశోర్, పృథ్వీ, రాహుల్ రామకృష్ణ, ప్రగతి




ఉండడంతో పంచ్ డైలాగులకు లోటు లేదు. "నేను ఏదైనా ప్రాబ్లంకి కనెక్ట్ అయితే... చివరిదాకా నిలబడడం నా బలహీనత" అంటూ హీరో క్యారెక్టర్ ను ఎలివేట్ చేసే డైలాగులతో ట్రైలర్ ఆసక్తి రేకెత్తిస్తోంది. విశ్వం చిత్రం అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇందులో జిషుసేన్ గుప్తా, నరేశ్, సునీల్, కిక్ శ్యామ్, వీటీవీ గణేశ్, శ్రీకాంత్ అయ్యంగార్, ముఖేశ్ రిషి తదితరులు కూడా నటించారు. ఈ యాక్షన్ ఎంటర్టయినర్ మూవీకి చైతన్ భరద్వాజ్ సంగీతం అందించారు.

## ఢీ సీక్వెల్ శ్రీనువైట్ల ఎందుకు

# చేయడం లేదో తెలుసా?

విజయవంతమైన చిత్రాలకు సీక్వెల్స్ తెరకెక్కించడం అనేది టాలీవుడ్‌లో ఇప్పుడు జోరందుకుంది. కొత్త కథల అన్వేషణ, క్యారెక్టర్స్ సృష్టి ఇవన్నీ కష్టతరమైన ఈ తరుణంలో నేటి దర్శకులకు తమ సినిమాలకు సీక్వెల్స్ చేయడమనేది మంచి ప్రత్యామ్నాయంలా కనిపిస్తుంది. ఇదే కోవలోనే తన దర్శకత్వంలో తెరకెక్కిన ఢీ చిత్రానికి అప్పట్లో సీక్వెల్ చేద్దామని శ్రీనువైట్ల అనుకున్నారు. మంచు విష్ణు, శ్రీహరి, జెనీలియా, బ్రహ్మానందం ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రం అప్పట్లో ఘనవిజయం సాధించింది. పూర్తి వినోదాత్మక చిత్రంగా ప్రేక్షకులు కూడా ఈ చిత్రాన్ని బాగా ఆదరించారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచన లేదని శ్రీనువైట్ల అంటున్నారు. ఆయన మాట్లాడుతూ... "ఢీ చిత్రంలో నటించిన శ్రీహరి మరణించడం వల్ల నా దృష్టిలో ఆయన పాత్రను ఎవరూ రీప్లేస్ చేయలేరు. అందుకే సీక్వెల్‌ను పక్కన పెట్టేశాను. ఢీ-2 చిత్రంను చేయాలనే ఆలోచన నాకు లేదు. కాకపోతే ఆ చిత్రానికి మించిన వినోదాత్మక చిత్రాలను అందించే ప్రయత్నంలో ఉన్నాను. త్వరలోనే విడుదల కానున్న నా చిత్రం 'విశ్వం'లో కూడా ఎంటర్‌టైన్‌మెంట్ అందర్ని అలరిస్తుంది" అన్నారు. అయితే టాలీవుడ్‌లో మాత్రం ఢీ-2 చిత్రాన్ని మంచు విష్ణు మరో దర్శకుడితో చేసే ఆలోచనలో ఉన్నారనే వార్త ప్రచారంలో వుంది.



## మీ రుణం ఈ జన్మలో


# తీర్చుకోలేనేమో: ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా, కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దేవర'. ఇటీవల విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. సినిమా రెండోవారంలోకి అడుగుపెట్టినా మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. ఇప్పుడు దసరా సెలవులు దేవరకు బిగ్గెస్ట్ అడ్వాంటేజీగా మారాయి. ఇక ఈ చిత్రంలో ఎన్టీఆర్ దేవర, వరగా చేసిన ద్విపాత్రాభినయానికి మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఇదిలా వుండగా ఈ చిత్రానికి సంబంధించి బ్లాక్‌బస్టర్ జర్నీ ఆఫ్ దేవర పేరుతో ఓ ప్రమోషనల్ వీడియో విడుదలైంది. ఎన్టీఆర్, కొరటాల శివ సినిమా జర్నీ గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను ఈ వీడియోలో పంచుకున్నారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక క్యాన్సిల్ కావడంతో అభిమానులను కలుసుకోలేకపోవడం తనకు చాలా బాధగా వుందని ఎన్టీఆర్ అన్నారు. ఈ విషయం గురించి ఆయన మాట్లాడుతూ 'ప్రీ రిలీజ్ వేడుక క్యాన్సిల్ తరువాత అభిమానుల కోసం మరో వేడుక పెట్టాలని అనుకున్నాం ఎందుకంటే ...అభిమానులు నన్ను చూడటం కంటే వాళ్లను నేను చూడటం నాకు ఆనందం. నా అభిమానులతో ఎలాగైనా కలవాలి.. లేదంటే నాకు వెలితిగా వుంది. ఎలాగైనా వాళ్లతో సక్సెస్ పార్టీ పెట్టాల్సిందే అనుకున్నాను. కానీ దేవి నవరాత్రుల వల్ల బహిరంగ వేడుకలకు అనుమతులు రాలేదు. అభిమానులతో నాది ఎప్పుడూ విడదీయలేని అనుబంధం. వాళ్లతో నా జర్నీ ఎంతో మధురం. నన్ను సినీ పరిశ్రమలో 24 ఏళ్లు మోశారు అభిమానులు. అది నెవర్ బి రీపెయిడ్. దేవర మీద కురిపించిన ప్రేమకు, నామీద కురిపించిన ప్రేమకు ఈ జన్మలో వాళ్ల రుణం తీర్చుకోలేను. కాకపోతే అభిమానులు కాలర్ ఎత్తుకుని తిరిగేలా చేయడం నా బాధ్యత. నిరంతరం నేను దానికోసమే ప్రయత్నిస్తాను. మీకు జీవితాంతం రుణ పడి వుంటాను' అంటూ చెప్పుకొచ్చారు



# సహజత్వం కోల్పోతున్న బతుకమ్మ ఆట, పాట

## – పాశ్చాత్త పోకడలే కారణమా..?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మారుతున్న కాలంలో పెరిగిన టెక్నాలజీతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పట్టుకొమ్మలైన మన పండగలు దారితప్పి పాశ్చాత్త సంస్కృతికి దాసోహం అనే పరిస్థితికి దిగజారాయి. శతాబ్దాల కాలం నుండి వారసత్వంగా వస్తున్న మన బతుకమ్మ పండగ అట, పాట నేడు లయ తప్పుతుంది. దీనికి పాశ్చాత్త పోకడలే కారణం. ఆనాటి బతుకమ్మ పాటల స్థానంలో నేడు డీజేలు, పూల స్థానంలో ప్లాస్టిక్ పూలు, ఆటలో పాశ్చాత డ్యాన్సులు రావడంతో బతుకమ్మ పండగ కల తప్పుతుందనడంలో అతిశయోక్తి లేదు. గతంలో బతుకమ్మ పండగ అనుబంధాలు ఆప్యాయతలకు చిరునామాగా ఉండేది. బతుకమ్మ పండగ వస్తుందంటే చాలు ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్ళు తమ సొంతూళ్ళకు వచ్చి బంధుమిత్రులతో కలిసి సందడి చేసేవారు. ఇక పాత కాలంలో అక్కా చెల్లెళ్ల కోసం అన్నలు, తమ్ముళ్లు ఉదయమే లేచి చెట్లు, పుట్టలు, పంట పోలాలు, తోటల్లో తిరిగి తంగేడు, గుమ్మడి, బీర, సీత జడ, గడ్డి బంతి వంటి పూలు తెచ్చేవారు. దీంతో అక్క, తమ్ముడు, చెల్లి, అన్నల మధ్య అనుబంధం పెరిగేది. ఇప్పుడు ఇలాంటి పరిస్థితుల జాడే లేదు. ఇప్పుడు మార్కెట్లలో కుత్రిమ ప్లాస్డిక్ బతుకమ్మలు దొరకడం దురదృష్టకరం.

### - ప్లాస్టిక్ పూలు

బతుకమ్మ పండుగ వచ్చిందంటే పోటీ పడి పూలను తెచ్చేవాళ్ళు. అప్పట్లో బంజరు భూములు, కంచెలు, చెరువు కట్టలపై తంగేడు, గునుగు పూలు విరివిగా దొరికేవి. ఆలాగే గ్రామాల్లోని చెరువులు కుంటల్లో తామర పూలు ఉండేవి. అయితే ఆ కుంటల్లో ఈత కొట్టి మరీ పూలు తెచ్చేటోళ్ళు. అయితే కబ్జాలతో చెరువులు, కుంటలు మాయమైన్నాయి. మైనింగ్ వల్ల గుట్టలు మాయమై పూల జాతి మొక్కలే కనుమరుగైపోయాయి.

### - పల్లెల్లో ఆనాటి సందడేది.?

బతుకమ్మ పండగ వస్తుందంటే చాలు తెలంగాణ పల్లెల్లో తెలియని ఉత్సాహం కనిపిస్తుంటుంది. గ్రామీణ ప్రాంతాల మహిళలకు బతుకమ్మ పండగ అంటే పెద్ద సంబంరం. ప్రతీ రోజు ఇళ్ళు శుభ్రపరిచి, చక్కగా అలంకరించుకుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకొస్తారు. ఎన్నో ప్రత్యేకతలు ఉన్న బతుకమ్మ పండుగను దాదాపు వెయ్యేళ్లుగా జరుపుకుంటున్నారని చరిత్రకారులు చెప్తున్నారు. అక్కడక్కడ దొరికిన శాసనాల ప్రకారం వందల ఏండ్ల నుంచే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఉందని తెలుస్తోంది. ఈ సంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో నవాబులు, భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వాళ్లు చేసే అకృత్యాలకు నలిగిపోయి, ఆ బాధలను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వాళ్లను తలచుకొని తోటి మహిళలు ఈ పండుగ చేసుకునేవాళ్లు. అందుకే వాళ్లకు ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా అంటు దీవిస్తు పాటలు పాడేవాళ్లు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' పాటల వెనుక ఉండే పరమార్థం ఇదే అని చరిత్ర ఆధారంగా తెలుస్తుంది.బతుకమ్మ పండుగ వెనుక ఇంకా చాలా కథలు ఉన్నాయి. బాగా ప్రాచుర్యంలో మరో కథ ఉంది. ఒక బాలిక భూస్వాముల అకృత్యాలను భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెను ఆ ఊరి ప్రజలు చిరకాలం 'బతుకమ్మా అని దీవించారట అలా ప్రతి ఏటా బతుకమ్మను కీర్తిస్తు పండుగ జరుపుకునే సంప్రదాయం మొదలైంది. ఈ పండుగ సందర్భంగా స్త్రీలంతా వాళ్లకు ఎలాంటి ఆపదలు రాకూడదని, తమ భర్తలు, కుటుంబం చల్లగా ఉండాలనీ గౌరమ్మను వేడుకుంటారు.

### - ధర్మాంగదుడు

దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళ వంశ చక్రవర్తి ధర్మాంగదుడు సంతానం లేక ఎన్నో పూజలు పునస్కారాలు చేశాడు. ఆ పూజల వల్ల ఆయన భార్య గర్భవతై లక్ష్మీదేవి అనుగ్రహంతో ఒక ఆడ కూతురుకు జన్మనిచ్చింది. ఆ బిడ్డ పసితనం నుంచే ఎన్నో గండాలు ఎదుర్కొని గట్టెక్కింది. అందుకే తల్లితండ్రులు ఆ పాపకు 'బతుకమ్మా' అని పేరుపెట్టారు. అప్పటినుంచి యువతులు మంచి భర్త దొరకాలని కోరుతు బతుకమ్మను కొలవడం ఆనవాయితీగా వస్తోందనే మరో కథ ప్రచారంలో ఉంది.

### - బృహదమ్మ

ఒకప్పుడు తెలంగాణ ప్రాంతాన్ని రాష్ట్రకూట రాజులు పరిపాలించేవారు. వాళ్లకు వేములవాడ చాళుక్యులు సామంతులుగా ఉండేవాళ్లు. అదే టైంలో చోళులకు, రాష్ట్రకూటులకు మధ్య యుద్ధం జరిగినప్పుడు చాళుక్యులు రాష్ట్రకూటులకు మద్దతిచ్చారు. వేములవాడలో అప్పటికే రాజరాజేశ్వర ఆలయం ఉంది. ప్రజలతోపాటు చోళరాజులు కూడా రాజరాజేశ్వరి అమ్మవారిని కొలిచేవాళ్లు. పరాంతక సుందర చోళుడు రాజరాజేశ్వరి అమ్మవారి పేరు మీదుగా తన కొడుక్కి రాజరాజ అని పేరు పెట్టుకున్నాడు. ఆ రాజరాజ చోళు డు కొడుకు రాజేంద్ర చోళుడు. రాజరాజ చోళుడు వేములవాడను పాలిస్తున్న చాళుక్య రాజు సత్యాశ్రాయపై యుద్ధం చేశాడు. ఆ సమయంలో రాజేంద్ర చోళుడు సేనాధిపతిగా ఉండి గెలిపించాడు. తర్వాత ఆ విజయానికి గుర్తుగా వేములవాడ లోని రాజరాజేశ్వరి ఆలయాన్ని కూల్చేసి అందులోని భారీ శివలింగాన్ని తీసుకెళ్లి తన తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. అప్పటికే రాజరాజేశ్వరికి భక్తుడైన రాజరాజచోళుడు తన కొడుకు ఇచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించడానికి క్రీస్తు శకం1006లో తంజావూరులో బృహదేశ్వరాలయ నిర్మాణాన్ని చేపట్టాడు రాజరాజ చోళుడు. దాని నిర్మాణం1010లో పూర్తయ్యింది. ఈ విషయాన్ని తమిళ శిలాశాసనాల్లో కూడా చోళ రాజులు చెప్పారు. రాజరాజేశ్వరి ఆలయంలోని శివలింగాన్ని పార్వతి (అప్పట్లో అమ్మవారిని బృహదమ్మగా పిలుచుకునే వాళ్లు) నుంచి వేరుచేసి తీసుకెళ్లటం తెలంగాణ ప్రజలను కలచివేసింది. దాంతో తమ బాధను చోళ రాజులకు చెప్తు మేరు పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మ చేయడం మొదలుపెట్టారు. అందుకే బతుకమ్మ ఆటలో శివుడు లేని పార్వతి గురించి పాటలు పాడుతుంటారు. అలా వెయ్యేళ్ల నుంచి ప్రతి ఏడాది పండుగ చేస్తున్నారు. బతుకమ్మ పేరు కూడా బృహదమ్మ అనే పేరు నుంచి వచ్చిందేనని చరిత్ర చెప్తోంది.

### - బతుకమ్మ పండగలో నిక్షిప్తమైన పర్యావరణం

బతుకమ్మ పండుగలో మరో పరమార్థం కూడా ఉంది. తంగేడు, గునుగు, గుమ్మడి ఆకులు, పసుపు ముద్ద, బంతి లాంటి పూలను బతుకమ్మగా పేర్చి చివరకు చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆకులు, పూలు నీళ్లలో నాని మెత్తబడి కుళ్ళిపోతాయి. తర్వాత నీటి అడుగుకు వెళ్లి మట్టిలో కలుస్తాయి. దీంతో ఆ మట్టి సారవంతం అవుతుంది. వేసవిలో చెరువు ఎండినప్పుడు రైతులు ఆ మట్టిని పొలాల్లో చల్లుకుంటార. దీంతో ఆయా పొలాలు సారవంతం అవుతాయని ప్రజల నమ్మకం. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న బతుకమ్మ పండగ విదేశీ పోకడల మాయలో పడి సహజత్వాన్ని కోల్పోతుండడం దురదృష్టకరం. శతాబ్దాల నుండి ఆచారాలను ముందు తరాలకు అందించాల్సిన భాధ్యత మనపై ఉంది. కావున ఆనాటి పండగల చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించి కాపాడుకోవాల్సిన అవసరం ఎతైనా ఉంది.

# పొలం ఉన్న రైతులనూ పొట్టనపెట్టుకున్నారు

## - రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడానికి రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణమని అన్నారు. పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నారు. కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ సర్కారే కారణం. ఓవైపు సాగునీటి సంక్షోభం. మరోవైపు రుణమాఫీ ద్రోహం. ఇంకోవైపు రైతుభరోసా మోసం. కౌలు రైతులకూ అందని సాయం. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలనుఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం అంటూ కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ధ్వజమెత్తారు. వందలాది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా చలనం లేదు. ముఖ్యమంత్రికి సోయి లేదు.. ప్రభుత్వానికి బాధ్యత లేదు. దసరా పండుగ వేళ.. వ్యవసాయాన్ని దండుగలా మార్చిన.. సీఎం రేవంత్ కు రైతన్నల చేతిలో దండన తప్పదు. అన్నదాతలారా ఆత్మస్థయిర్యం కోల్పోకండి..! ముంచే రోజులు పోతాయ్..!! మళ్లీ మంచిరోజులొస్తాయ్..!!! జై కిసాన్ అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ పేర్కొన్నారు. మరోవైపు, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత ఏడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని గ్రామాల్లో ప్రచారం చేసిన యువత ఒక్కసారి ఆలోచించాలన్నారు. గ్యారెంటీలు అమలు చేయలేకపోగా, మీ ఊళ్లలో అవ్వాతాతలకు పెంచుతామన్న పింఛన్ పెంచలేదు, రుణమాఫీ పూర్తి చేయలేదు, రైతు బంధును నిలిపివేశారు, రైతు భరోసా దిక్కులేకుండా పోయింది, బోనస్‌ను బోగస్ చేశారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అన్నరు, పది నెలలు గడిచాయి అతీ గతి లేదు. నాలుగు వేల నిరుద్యోగ భృతికి నీళ్లు వదిలారు అని కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఈ దసరాకు మీ ఊళ్లకు వస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులతో అలాయ్ - బలాయ్ తీసుకుంటూ కాంగ్రెస్ చేసిన మోసాల గురించి చర్చించండి. మీ ప్రాంతాల్లోని కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీలతో పాటు, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, మైనారిటీ డిక్లరేషన్, బీసీ డిక్లరేషన్‌లపై ఎక్కడిక్కడ నిలదీయాలని హరీశ్ రావు పిలుపునిచ్చారు.

# తేల్చుకోవాల్సింది చంద్రబాబే

## - విశాఖ ఉక్కు కర్మాగారంపై చంద్రబాబుకు లేఖ



**అమరావతి** విశాఖపట్నం ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గట్లేదు. ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేసింది. ఉక్కును ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడి ఇనుము, బొగ్గు సరఫరాను నిలిపివేసింది. ఫలితంగా బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూతపడ్డాయి. ఉద్యోగుల తరలింపు సైతం ముమ్మరం అయింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో శాశ్వత ప్రాతిపదికన పని చేస్తోన్న వారిలో వంద మందిని డెప్యుటేషన్ మీద పంపించనుంది కేంద్రం. వారందరినీ కూడా నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో సర్దుబాటు చేయనున్నారు. అదే సమయంలో 4,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులనూ తొలగించినట్లు వార్తలొచ్చాయి. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని వందశాతం మేర ప్రైవేటీకరించి తీరుతామంటూ గతంలో కేంద్ర ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. దాన్ని విక్రయించే దిశగా అడుగులు వేసింది. ఈ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి విశాఖపట్నం సహా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఇదివరకు రాజకీయ పార్టీలు నిర్వహించిన ప్రదర్శనలను గానీ, ఆందోళనలను గానీ కేంద్ర ప్రభుత్వం బేఖాతర్ చేస్తూ వచ్చింది. ఈ పరిస్థితుల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన తలపెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మావోయిస్టుల ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరు కానున్నారు. ఆయా రాష్ట్రాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనుంది కేంద్రం. చంద్రబాబు ఢిల్లీ పర్యటన నేపథ్యంలో– ప్రదేశ్ కాంగ్రెస్ అధినేత్రి వైఎస్ షర్మిల కీలక డిమాండ్‌ను ఆయన ముందు ఉంచారు. విశాఖ స్టీల్ పరిరక్షణపై గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతగా 2021లో చంద్రబాబు సంతకం చేసి ఇచ్చిన లేఖను ఆయనకు పంపించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకుంటానని, అవసరమైతే తమ పార్టీ ఎమ్మెల్యేలందరూ రాజీనామాలు కూడా చేస్తారంటూ అప్పట్లో ఈ లేఖలో పొందుపరిచారు చంద్రబాబు. ఇప్పుడు అదే అంశాన్ని వైఎస్ షర్మిల తెరమీదికి తీసుకొచ్చారు. మాట మీద నిలబడే తత్వం ఉంటే, అప్పట్లో ఇచ్చిన ఈ లేఖకు విలువ ఉంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా లను నిలదీయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోతే మద్దతు ఉపసంహరించుకుంటామంటూ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఆంధ్రుల హక్కు ముఖ్యమా? లేక బీజేపీతో పొత్తు ముఖ్యమా? విశాఖ ఉక్కు ముఖ్యమా? లేక ఎన్డీఏలో పదవులు ముఖ్యమా?, మాట మీద నిలబడే సిఎం అవుతారా?, లేక మోసగాడుగా ముద్ర వేసుకుంటారా? తేల్చుకోవాలని అన్నారు. విజయదశమి కానుకగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయనున్నట్లు,14,000 మంది కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించనున్నట్లు, భూములు కోల్పోయిన 8,000 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు, 23,000 ఎకరాల్లో ఒక్కటి కూడా అమ్మేది లేనట్లు కేంద్రంతో అధికారిక ప్రకటన చేయించాలని, అలాంటి డిమాండ్ ఏదీ రాకపోతే ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగాలని షర్మిల డిమాండ్ చేశారు.

# ఒక్కో పథకానికి రేవంత్ సర్కార్ మంగళం

## – పది నెలల్లోనే ఇంత తేడానా..?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గత దశాబ్ది కాలం పాటు తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారాన్ని చేపట్టింది. ఆ ప్రభుత్వం హయాంలో పలు ప్రజాకర్షక పథకాలు అమలయ్యాయి. అయితే పది నెలల క్రితం అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వం స్కీముల్లో కొన్నింటికి మంగళం పాడుతున్నట్లు కనిపిస్తోంది. ఓ వైపు నిధుల లేమి, మరోవైపు ఆ స్కీముల్లో అవకతవకలు జరిగాయంటూ రేవంత్ ఈజీగా వాటిని డైవర్ట్ చేస్తున్నారు. అలా ప్రజలకు సైతం అనుమానం రాకుండా ఒక్కో పథకం నుంచి భారాన్ని తగ్గించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగకు ఉన్న ప్రత్యేకత ఏంటో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఈ పండుగ వచ్చిందంటే ఎక్కడెక్కడో ఉన్న మహిళలంతా తమ తల్లిగారింటికి చేరుతుంటారు. తొమ్మిది రోజుల పాటు మహిళలంతా ఒక దగ్గరకు చేరి పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపడుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వచ్చే గురువారం సద్దుల బతుకమ్మ సైతం జరగనుంది. ఈ క్రమంలో రాష్ట్రమంతటా మహిళల్లో రేవంత్ సర్కార్‌పై కీలక చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం హయాంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు నుంచి బతుకమ్మ పండుగ వచ్చిందంటే రేషన్ కార్డులు కలిగిన మహిళలందరికీ ఒక్కో చీర ఇచ్చే వారు. పండుగకు బహుమతిగా అందించే వారు. అలా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ఏటా బతుకమ్మ పండుగ వచ్చిందంటే రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసేవారు. పది నెలల క్రితం అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు కేరాఫ్ అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఇచ్చే కానుకకు మంగళం పాడారు. రాష్ట్రంలో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమై ఐదు రోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు వారికి చీరలు అందించలేదు. అయితే బతుకమ్మ చీరల పథకంలో కోట్ల రూపాయల అవకతవకలు జరిగాయంటూ ప్రభుత్వం ఆరోపిస్తోంది. చాలా మంది చీరల పేరిట అడ్డగోలుగా దోచుకున్నారని చెబుతోంది. అయితే ఈసారి చీరలకు బదులు రూ.500 చొప్పున నగదు అందిస్తారంటూ ప్రచారం జరిగింది. కానీ పండుగ ప్రారంభమై ముగిసే సమయం దగ్గరపడుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన కనిపించడంలేదు. ఏటా అందే చీరలు రాకుండా పోయాయి. ప్రభుత్వం నుంచి వచ్చిన లీకులు రూ.500 కూడా మహిళలకు అందకుండా పోయాయి. దాంతో ఈసారి ప్రభుత్వం తరపున బతుకమ్మ బహుమతి లేకుండానే మహిళలు పండుగను జరుపుకోవాల్సిన దుస్థితి వచ్చింది. రైతులకు ఎంతగానో ఉపయోగపడే రైతు బీమాకు కూడా రేవంత్ సర్కార్ బైబై చెప్పినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న రైతులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీమా కవరేజీని అమలు చేసింది. ఆగస్టు 15, 2018 నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. రైతుల తరపున లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంవత్సరానికి రూ.500 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. దాంతో ఏ రైతు మరణించినా తెలంగాణలో ఆ రైతు కుటుంబానికి రూ.5 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఏ కారణంతో మరిణించినప్పటికీ ఈ బీమా కవరేజీ ద్వారా పరిహారం పొందొచ్చు. అయితే ఈ బీమా పొందడానికి రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అక్కర్లేదు. రైతు చనిపోయిన పది రోజుల్లోపు నామినీకి పరిహారం అందిస్తారు. అయితే రేవంత్ సర్కార్ ఈ పథకానికి గుడ్ బై చెప్పినట్లుగా సమాచారం. నిధులు లేవనే సాకుతో రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక అసెంబ్లీ ఎన్నికలకు ముందు కల్యాణ లక్ష్మి స్కీమ్ కింద లక్ష సహాయంతో పాటు తులం బంగారం సైతం ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పారు కాంగ్రెస్ నేతలు. కానీ అధికారం చేపట్టి ఇంత కాలం అయినప్పటికీ ఆ తులం బంగారం విషయంపై ఇంతవరకు ప్రస్తావన తీసింది లేదు.

కనీసం కాంగ్రెస్ పెద్దలు లేదా ముఖ్యమంత్రి రేవంత్, మంత్రివర్గం కూడా ఈ స్కీమ్‌పై ఎక్కడా మాట్లాడిన దాఖలాలు కనిపించడంలేదు. దీంతో అసలు హామీ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఈ విషయం గుర్తుందా అనే ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. మరో మేజర్ స్కీమ్ మహిళలకు రూ.2,500 సహాయం. తాము అధికారంలోకి వస్తే ప్రతీ మహిళకు రూ.2,500 చొప్పున నెలనెలా అందిస్తామని రేవంత్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోనూ చేర్చారు. దాంతో మహిళలంతా ఇక తమకు నెలనెలా రూ.2,500 వస్తాయని సంబురపడ్డారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. కానీ ఇంతవరకు ఈ స్కీమ్ అమల్లోకి వచ్చింద లేదు. దాంతో మహిళలంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఏమైనా అంటే నిధులు లేవని రేవంత్ సర్కార్ చెబుతోంది. నిధులు లేవని పథకాల అమలుకు దేర్ చేయడం లేదనే టాక్ నడుసోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588